GIRDHARI, RNI Regn.No.TELTEL/2021/80612, Date of Pub - 25th of every month
Date posting - 1st of every month at BPC-IV, Patrika Channel, HYD - 01
Postal Regn.No.HQ/SD/525/2024-2026; Licensed to Post without prepayment
WPP No.PMG/TS/HQR/SC-04/WPP/2024-2026

చైతన్య వనవాటికలో గానకోకిల



పూజ్య గురుదేవుల పద సన్నిధిలో శ్రీమతి ఎస్.జానకి

1993 వ సం॥లో పూజ్య గురుదేవులు స్వామి సుందర చైతన్యానందుల వారు తమ సలలిత వ్యాఖ్యానంతో, అమోఘ దర్శకత్వంలో రమణీయ కళాఖండంగా రూపొందించిన 'భక్త కుచేల' ప్రాయోజిత కార్యక్రమం హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రం ద్వారా ప్రసారితమైంది.

ఈ ఎపిసోడ్ కోసం పూజ్య గురుదేవులు రచించి, స్వరపరచి, సంగీతం సమకూర్చిన గీతాన్ని కుచేలుని పాత్రకు శ్రీ స్వామీజీ, కుచేలుని అర్ధాంగి పాత్రకు శ్రీమతి ఎస్.జానకి గానం చేయడం జరిగింది. ఆ సందర్భంలో ఆమె శ్రీ స్వామీజీని దర్శించుకొని తమ భక్తి ప్రపత్తులను ప్రకటించుకున్నారు.

భక్తి ఎన్నడూ వృథా కాదు
భక్తు డెప్పుడూ వృథా పోడు.

Edited, printed, published and owned by Swami Sundara Chaitanyananda, Printed at M/s Karshak Print Solutions Pvt. Ltd., Moula Ali, Hyd - 500 040.

IF UNDELIVERED PLEASE RETURN TO :
SUNDARA CHAITANYA ASHRAM
HYDERABAD - 500 043

గిరిధారి

ఆగస్టు 2026

శాశ్వత చందా రూ.1200/-
10 సం॥ లకు




యజ్ఞ పోషకులు



శ్రీమతి జి.కళా రెడ్డి
హైదరాబాద్, రూ.2,00,000/-



శ్రీమతి జి.పద్మజా రెడ్డి
అమెరికా, రూ.2,00,000/-




శ్రీ కె.అనిల్ కుమార్ రెడ్డి
అమెరికా, రూ.1,01,116/-



సద్గురు సదనం
ఆశ్రమం
రూ.1,00,000/-



శ్రీమతి ఎమ్.విమల
శ్రీ ఎమ్.ఎల్.ఎన్.నాగేంద్ర కుమార్
హైదరాబాద్, రూ.1,00,000/-




స్వాధ్యాయ మాతృమండలి
ఆశ్రమం
రూ.78,000/-



శ్రీమతి ఐశ్వర్య, శ్రీ సిద్ధార్థ
చి॥ రుద్రవీర్
నెల్లూరు, రూ.50,000/-


మహారాజ పోషకులు



సుందర సత్సంగ్
తొర్రూరు
రూ.40,000/-



శ్రీమతి కె.సుష్మ
శ్రీ కె.రజనీశ్
హైదరాబాద్
రూ.30,000/-



శ్రీమతి పి.సుజాత
కరీంనగర్
రూ.25,000/-



శ్రీమతి డి.మాధవి
శ్రీ డి.భిక్షపతి
హైదరాబాద్
రూ.25,000/-



శ్రీ కె.భాస్కర్ రెడ్డి
హైదరాబాద్
రూ.25,000/-



శ్రీ ఎ.భరత్ రామ్
హైదరాబాద్
రూ.25,000/-



శ్రీమతి ఎమ్.సత్యవతి
హైదరాబాద్
రూ.25,000/-



శ్రీమతి కె.సుస్మిత
హైదరాబాద్
రూ.25,000/-

ప్రార్థన






శ్లో॥ నిత్యయుక్తాశ్రయ స్సర్వ
వేదకృ త్సర్వ వేదకృత్ ।
స్వపర జ్ఞానదాతా చ
తం వందే గురుమీశ్వరమ్ ॥

ఏ మహాత్ముడు నిత్యుడైన పరమాత్మతో కూడిన యోగమును ఆశ్రయించిన వాడై, సర్వ వేదములను, సమస్త జ్ఞానమును ఉపదేశించు వాడై, తన యొక్క, పరమాత్మ యొక్క జ్ఞానమును అనుగ్రహించు వాడై యున్నాడో అట్టి గురుదేవుని నమస్కరించు చున్నాను.

పండుగలు

వరలక్ష్మీ వ్రతం
21-8-2026
రాఖీ పౌర్ణమి
28-8-2026



గీతధార
ఆధ్యాత్మిక మాసపత్రిక
సంపుటి : 41 సంచిక : 9
వ్యవస్థాపకులు :
శ్రీ స్వామి సుందర చైతన్యానంద

ఇందులో

సంపాదకులు : శ్రీ స్వామి సుందర చైతన్యానంద


జీవిత సభ్యత్వం - రూ. 1200 /-
(10 సంవత్సరములు)

డి.టి.పి. & కవర్ డిజైన్
సుందర చైతన్యాశ్రమం, హైదరాబాద్

ప్రింటింగు : బైండింగు
కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్

వివరములకు : సుందర చైతన్యాశ్రమం,
దుండిగల్ రోడ్, హైదరాబాద్ - 500 043. ఫోన్:(08418)255777, 9100908777


Visit us at : www.sundarachaitanyam.com (email : admin@sundarachaitanyam.org)





ఆప్తవాక్యం

జననీ! ఆదర్శ భారతావనీ!




జననీ! పరమ పావనీ!
నిత్య కళ్యాణ జననీ!
ఆదర్శ భారతావనీ!
ఆచార్యుల గన్న తల్లీ! ఆనంద కల్పవల్లీ!
వందన మమ్మా! అందుకోవమ్మా!
అమ్మా!
అందునా వీనుల విందుగా నేను "హిందూ" నని!
'హిం'సకు **'దూ'**రుడే హిందువని మందబుద్ధుల కందునా?
'సర్వేజనా స్సుఖినో భవంతు'
అనే పలుకు నందించిన హిందువు
విశ్వ తలుపులు తెరిచిన బంధువు.
అందుగల డిందులేడను సందేహము నీకెందు కెందుకని
అందము నంతా దేవుని యందే చూచెను హిందువు కందోయి!
వందనమును ముందుగ నేర్పిన
సదాచార సింధువు హిందువు. అపర దయా సింధువు హిందువు.
సంద్రమంత అందగాడు హిందువు. అంబరమంత అనంతుడు హిందువు.
ఆధ్యాత్మిక గగన సీమన నిండు చందురుడు హిందువే.
అందాలకు అందము హిందువు
బృందావనమే డెందముగా గల
అందరివాడు హిందువు, అసురనీతికి అందనివాడు హిందువు.
వేద ధరిత్రీ! ఓ జనయిత్రీ! సుందరనేత్రీ! సుమగాత్రీ
మంచుకన్నా మెత్తని తల్లీ! వెన్నెల కన్నా చల్లని తల్లీ!
తేనెల కన్నా తియ్యని తల్లీ! మహిలో మహిమలు నిలిపిన తల్లీ!
అమ్మా! భారతీ! అందుకో నీ బిడ్డల హారతీ!

ఓం స్వామి సుందర చైతన్యానంద

ఆచార్య దేవో భవ!

శ్రీమతి సి.పద్మ



చెట్టు విడిచే నిశ్వాసలే మనిషికి ప్రాణవాయు వైనట్లు, నిర్వేదంలో జనించే నివేదనలే సాధనకు ప్రాణం పోస్తాయి.

ఆకలితో తిన్న ఆహారమే దేహానికి పుష్టి నిచ్చినట్లు, ఆసక్తితో విన్న విషయాలే మనసుకు శక్తి నిస్తాయి.

దేహం లోనే ప్రాణం, దేహం లోనే మనస్సు. దేహం లోనే ఆత్మ, దేహం లోనే అనాత్మ.

ఎక్కడైనా వాలగలిగే ఈగ నిప్పు మీద వాల లేనట్లు, విశ్వాన్ని ఆపోశనం పట్టే మనస్సు సత్య దర్శనానికి సిద్ధం కాలేక పోతోంది. దేహం లోనే ఉంటూ దేహిని దర్శించలేక పోతోంది.

"కలిసి వచ్చిందెవరు? విడిచి పోయే దెవరు? ఎప్పుడు సంయోగం? ఎక్కడ వియోగం? రాకపోకల మర్మ మెరిగి, ధర్మాధర్మాల వివేకం పెరిగి, కర్మను యోగంగా మార్చుకో గలిగితే జ్ఞాననిష్ఠకు నీవు సిద్ధం" అంటూ గీతాచార్యుడు చేసిన అద్భుత బోధను శ్రీశంకర భాష్య వెలుగులో దర్శింప చేస్తూ, యుక్తిని జోడిస్తూ, స్వానుభవములో రంగరిస్తూ, వారం వారం అస్మదాచార్యులు అందిస్తున్న **చైతన్య భగవద్గీత** మోక్ష మార్గంలో ముముక్షువులకు కల్ప వృక్షం అనడం అతిశయోక్తి కాదు.

గురుదేవా!

తెలియని పదాలను పరిచయం చేస్తూ, తెలిసిన పదాలకు క్రొత్త అర్థాలను చెబుతూ, అడుగడుగునా స్వచ్ఛతను, స్పష్టతను ప్రసాదిస్తూ, మాటలలో మర్మాలను వెలికి తీస్తూ, వాక్య మందార మాలలను మనోహరంగా అల్లి, వాగ్దేవి కంఠసీమను మనోజ్ఞంగా అలంకరిస్తూ, అక్షరార్చనను సాగిస్తున్న * **ఓ వివిక్తాభిదాయీ! నమోనమః.**


'కదిలే దేవాలయంలో పలికే దేవుడే స్థితప్రజ్ఞుడు' అని మీరు అమోఘంగా నిర్వచించిన వాక్యం మా కన్నులలో వెన్నెలలు నింపి మీలో వెలిగే స్థితప్రజ్ఞునికి హారతిమ్మంటుంది.

---

*'**వివిక్తాభాభిదాయి**' అంటే, ఏ విషయానికి ఆ విషయాన్ని విడమరచి చెప్పేవాడు అని అర్థము.

లోకమంతా చీకటిలో ఆదమరచి నిద్రిస్తున్న రాత్రి, **యా నిశా సర్వభూతానాం** అనే శ్లోకంపై భాష్యానికి అదే సరైన సమయ మని యెంచి, నిశను పగలుగా మార్చి, నిద్రనే నిద్రపుచ్చి, **'జ్ఞానికి ద్వైతమే రాత్రి, అద్వైతమే పగలు'** అని మీరు రచించిన వ్యాఖ్యానం **ఓ సంయమీంద్రా! న భూతో న భవిష్యతి.**

బాలభానుణ్ణి కళ్ళార చూడగలము. మధ్యాహ్న మార్తాండుణ్ణి చూడలేక తల దించుకుంటాము. భాను ప్రకాశ సదృశమైన మీ జ్ఞాన ప్రకాశం ముందు మా తలలు అప్రయత్నంగా వంగుతున్నాయి. భక్తి భావంతో తలపులు పండుతున్నాయి. మంగళకర దృష్టితో నేత్రాలు పవిత్ర మవుతున్నాయి.



వెలుగు ఎప్పుడూ ఉన్నా, చూచేందుకు కళ్ళు ఉండాలి. మీలో ఎప్పుడూ అదే జ్ఞాన వైభవం. గుర్తించేందుకు మాకు సంస్కారం కావాలి. కాలం పుణ్యం కూడా కలిసి రావాలి.

గురునాథా!

చేతి గీతలు చెరిపేసుకునేందుకు, నొసటి రాతలు తుడిచేసుకునేందుకు ఒక్క **చైతన్య భగవద్గీత** చాలు. చేతి కందుకొని కళ్ళకద్దు కుంటాము. ప్రతి నిత్యం పఠిస్తూ, అర్థం చేసుకుంటాము. ప్రతి నిముషం స్మరిస్తూ, అనుక్షణం అవలోకిస్తూ, చైతన్య గీతా కల్పతరువు ఛాయలో సేద దీరుతాము.

గురుదేవా! 78 వసంతాల మీ పవిత్ర జీవితంలో 60 వసంతాలు నిస్వార్థ ఆధ్యాత్మిక సేవలో నీరాజనా లయ్యాయి. నిత్య కళ్యాణంగా సాగుతున్న సుందర చైతన్య మహోద్యమంలో మీరు వెలిగించిన జ్ఞానదీపాలే మా హృదయాలు. మీరు పెంచిన ప్రేమ వనాలే మా జీవితాలు. మా బ్రతుకులలో వెలుగులు నింపేందుకు అహర్నిశం శ్రమిస్తున్న మీకు ముముక్షు లోకం ముకుళిత హస్తాలతో వందనాలు సమర్పిస్తోంది. అనుగ్రహించి ఆశీర్వదించండి.

జై జై గురుదేవ!

కావగరావా! కరుణింపగ లేవా!

('భక్త కుచేల' ప్రాయోజిత కార్యక్రమానికి పూజ్య గురుదేవులు రచించి గానం చేసిన పాట)

పల్లవి :

కావగరావా! కరుణింపగ లేవా!




అనుపల్లవి :

భక్తే గాని ముక్తి ఎరుగని శక్తిహీనులం
అతిదీనులం - బలహీనులం ॥ కావగ ॥

చరణములు :

1. వెన్నలాంటి నీ మనసు
మిన్నకున్న దేమి స్వామి
మా నొసటి రాతలు అడ్డుకున్నవా ఏమి?
అందరి వాడవా!
మా కందని వాడవా? ॥ భక్తే గాని ॥



2. పువ్వులలో దారము వోలె
ఒదిగి పోయినావా స్వామీ!
పువ్వుల సువాసన వోలె కానరాక ఉంటివా?
వినిపించే స్వామీ - మాకు కనిపించవదేమి?
చెవులు చేసిన పుణ్యమేమి?
కన్నులలో పాపమేమి? ॥ కావగ ॥



శ్రీ ఆదిశంకరాచార్య స్వామి కృతం

దక్షిణామూర్తి స్తోత్రం

ధారావాహిని-5

వ్యాఖ్య
శ్రీ స్వామీజీ

4 వ శ్లోకము

నానాఛిద్ర ఘటోదర స్థిత మహా దీపప్రభా భాస్వరం
జ్ఞానం యస్యతు చక్షురాది కరణ ద్వారా బహి స్స్పందతే ।
జానామీతి తమేవ భాంత మనుభా త్యేతత్ సమస్తం జగత్
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥

యస్య = ఎవని యొక్క
జ్ఞానం = జ్ఞానము
నానాఛిద్ర = అనేక రంధ్రములు గల
ఘటోదర = కుండ లోపల
స్థిత = ఉన్న
మహాదీప = గొప్ప దీపము యొక్క
ప్రభా = ప్రకాశము వలె
భాసతే = భాసించు చున్నదో
చక్షురాది = కన్ను మొదలైన
కరణ ద్వారా = ఇంద్రియముల ద్వారా
బహిః = బాహ్యానికి
స్పందతే = వ్యాపించు చున్నదో

భాంతం = వెలుగుచున్న
తం ఏవ = అతనినే
ఏతత్ = ఈ
సమస్తం జగత్ = సకల ప్రపంచము
జానామి = తెలుసుకొను చున్నాను
ఇతి = అని
అనుభాతి = అనుసరించి భాసించు చున్నదో
తస్మై = అట్టి
శ్రీగురుమూర్తయే = శ్రీ గురుమూర్తి అయిన
శ్రీదక్షిణామూర్తయే = శ్రీ దక్షిణామూర్తికి
నమః = నమస్కారము.

భావము

అనేక రంధ్రములు గల పెద్ద కుండలో ఉన్న దీపము, కుండ రంధ్రాల ద్వారా వెలుగును బాహ్యానికి చిమ్మి, ఆయా కిరణాలకు విషయాలైన వాటిని ప్రకాశింప చేయుచున్నదో, అలాగే వ్యక్తి లోని జ్ఞానము ఇంద్రియాల ద్వారా బాహ్యానికి చిమ్ముతున్నది. 'నేను' తెలుసుకొను చున్నాను అని స్వప్రకాశమైన ఎవనిని అనుసరించి ఈ ప్రపంచము ప్రకాశించు చున్నదో అట్టి గురుమూర్తి యైన దక్షిణామూర్తికి నమస్కారము.

వ్యాఖ్య

ఉన్నవన్నీ ఎలాగైతే సత్యంగా ఉన్నదానిపై ఆధారపడి ఉన్నవో, అలాగే ప్రకాశిస్తూ ఉన్నవన్నీ సత్యంగా ఉన్నదానిపై ఆధారపడి ప్రకాశిస్తున్నాయి. సత్యం ఉంది. అలాగని ఉన్నదంతా సత్యం కాదు. స్వతః సిద్ధం కాదు. అలాగే ఉన్నవి తెలుస్తూ ఉండొచ్చు. అంతమాత్రాన అవన్నీ స్వప్రకాశం కావు. స్వతస్సిద్ధంగా, స్వప్రకాశంగా ఉన్నదేదో అదే సత్యము. అదొక్కటే సత్యము. మిగిలిన వన్నీ దానిని అనుసరించి ఉన్నవే. అదొక్కటే ప్రకాశము (భాతి). మిగిలిన వన్నీ దాని ననుసరించి ప్రకాశించేవే (అనుభాతి). అదే సత్యం. అదే చైతన్యం. అది ఉంటే, అన్నీ ఉన్నాయి ***(అస్తిత్వం).*** అది ప్రకాశిస్తే అన్నీ ప్రకాశిస్తాయి ***(ప్రకాశత్వం).***

తస్మాత్ సత్తా స్ఫురత్తా చ భావానాం ఈశ్వరాశ్రయాత్

కనుకనే వస్తువుల (భావానాం) ఉనికి (సత్తా) మరియు ప్రకాశము (స్ఫురణ) ఈశ్వరుని ఆశ్రయించుకొనే ఉన్నాయి ***(ఈశ్వరాశ్రయాత్)*** అని మానసోల్లాసము.

ప్రపంచం సత్తా స్వరూపం కాదు. కాని సత్తా ప్రభావం చేతనే ప్రపంచానికి మనుగడ ఉంది. ప్రపంచం స్వప్రకాశం కాదు. కాని, సత్తా మాత్రమైన స్వప్రకాశము యొక్క ప్రభావం వల్లనే ప్రపంచానికి ప్రకాశముంది. అంతా ఇలాగే ఉంటుంది. అట్టి స్వతస్సిద్ధ స్వప్రకాశ చైతన్యమే ఆత్మ. అదే నీవు. సర్వ ప్రకాశాలకు ఆధారమైన స్వప్రకాశానివి. ఈ సత్యం ఒక అరుదైన అందమైన ఉపమానం ద్వారా బోధింప బడుతూ ఉంది.

అనేక రంధ్రాలు గల ఒక కుండ లోపల దీపం వెలుగుతూ ఉంది. ఆ కుండ ఒక చీకటి గదిలో ఉంచబడింది. కుండ లోపల వెలుగుతున్న దీపం కుండ లోపల ప్రదేశాన్ని ప్రకాశింప చేస్తూ, రంధ్రాల ద్వారా బాహ్యానికి విరజిమ్ముతూ, ఆయా కిరణ కాంతి ప్రవాహంలో ఉన్న వస్తువులను ప్రకాశింప చేస్తూ ఉంది. ఏ కాంతి కిరణానికి ఏది విషయమో అదే గోచరిస్తుంది. ఒక కాంతి కిరణానికి విషయంగా ఉన్నది మరొక కాంతి కిరణానికి విషయం కాకపోవచ్చు. అన్ని దిక్కులలో అన్నిటినీ ప్రకాశింప చేసే కాంతి ఒకే కిరణానికి విషయం కాకపోవచ్చు. కానీ, అన్ని దిక్కులలో, అన్నిటినీ ప్రకాశింప చేసే దీపము ఒక్కటే. ఒకే ప్రకాశము. ప్రకాశింప బడేవి అనేకము. ప్రకాశింప చేసేది ఒక్కటే.

మానవ దేహము కుండ లాంటిది. అది జడము. దానిలో చైతన్యాత్మ ప్రకాశిస్తూ ఉంది. దీపం నుండి వెలువడే కాంతి కిరణము ద్వారా వస్తువు విషయ మైనట్లు, చైతన్య జ్యోతి జ్ఞానవృత్తి ద్వారా ***'అహం జానామి'*** నేను తెలుసుకుంటున్నాను అని జ్ఞాన రూపంగా భాసిస్తోంది.

వస్తువులు చైతన్యం కన్నా బాహ్యంలో ఉన్నాయి. అన్యంగా ఉన్నాయి. కనుకనే తెలియబడుతున్నాయి. అలా తెలియబడే వాటిలో ప్రపంచమే కాదు. నా దేహము,

ఇంద్రియాలు, మనస్సు, అజ్ఞానము అన్నీ ఉన్నాయి. అన్నిటినీ చైతన్యమే ప్రకాశింప చేస్తూ ఉంది.

తెలిసే వన్నీ వృత్తుల లోనే తెలుస్తున్నాయి. విషయాలు మారుతున్నాయి. వృత్తులు మారుతున్నాయి. వృత్తులు మారుతున్నవి అని గ్రహించే 'అహం వృత్తి' మారడం లేదు. ఈ అహం వృత్తికి కూడా ఆద్యంతా లున్నవి. అవి కూడా ప్రకాశింప బడుతున్నాయి. ప్రకాశింప బడుతున్నాయి కనుక ఈ జ్ఞానాలన్నీ బాధిత జ్ఞానాలు. వచ్చిపోయే స్వభావం కలవి. దృష్ట నష్ట స్వభావం కలవి. అవి వుంటే, ఉన్నవని తెలుసుకొనే జ్ఞానం ఉంది. అవి లేకపోతే, వాటి అభావాన్ని తెలుసుకుంటూ ఉంది. అదే చైతన్యం. అదే ఆత్మజ్ఞానం. లేనిది ఏది వచ్చినా, ఉన్నది ఏది లేకుండా పోయినా, ఈ రెండిటిని ప్రకాశింప చేసే జ్ఞానముంది. అదే స్వతస్సిద్ధం. స్వప్రకాశం. అది ఉండటం చేతనే అనిత్యాలు ఉన్నట్లు తెలుస్తున్నాయి. అది ప్రకాశించుట చేతనే అప్రకాశాలు ప్రకాశిస్తున్నాయి. అదేమిటి? అదే ఆత్మ. అదే నేను. అహం ప్రకాశ స్వరూపం. అది పుట్టేది కాదు. గిట్టేదీ కాదు.

నోదేతి నాస్తమే త్యేషా న వృద్ధిం యాన్తి నక్షయం,

స్వయం విభాతి అన్యాని భాసయేత్ సాధనం వినా ॥

'ఆత్మ ఉదయించదు. అస్తమించదు. పెరగదు. తరగదు. స్వప్రకాశంగా ఉంది. తాను ప్రకాశిస్తూ సమస్తమును మరో సాధనము లేకుండా ప్రకాశింప చేస్తూ ఉంది' అని వేదాంత సమ్మతము.

చైతన్యానికి ఉదయాస్తమయాలు ఉంటే అది పుట్టక ముందు, లేదా గిట్టిన తరువాత లేనిదై ఉంటుంది. సరే, అలాగే అనుకుందాం. అలా లేని దానిని 'లేదు' అని తెలుసుకొనేది ఉండాలా? లేదా? తాను లేనని తనకే ఎలా తెలుస్తుంది? తాను లేని స్థితిని తెలుసుకొనే చైతన్యం వేరొకటి ఉంటే, అలా తెలుసుకున్న దెవరో, అది చైతన్యమే కదా! అలాంటపుడు చైతన్యం లేకుండా పోయిం దెప్పుడు? చైతన్యము యొక్క అభావాన్ని ఋజువు చేయడం సాధ్యం కాదు కనుక చైతన్యము పుట్టేది కాదు. కనుక స్వతః సిద్ధం. గిట్టేది కాదు కనుక స్వప్రకాశం ***(న ఉదేతి న అస్తమేతి).*** ఇదే ఆత్మ. స్వయంజ్యోతి. అదే నీవు. అదే నేను.

అహమితి ఐశ్వరం భావం యదా జీవః ప్రబుధ్యతే,

సర్వజ్ఞః సర్వకర్తా చ తథా జీవో భవిష్యతి ॥

'నేనే ఆత్మను. ఈశ్వర చైతన్యాన్ని అనే జ్ఞానము జీవునకు కలిగి నపుడు తానే సర్వజ్ఞుడు, తానే సర్వకర్తా అగుచున్నాడు' అని సురేశ్వరుని వార్త్తికము. అట్టి స్వప్రకాశ రూపుడైన దక్షిణామూర్తి గురుదేవునకు నమస్కారము.


(సశేషం)

ఓ కథ చెప్పనా!

స్వామి సుందర చైతన్యానంద

ముహూర్త కాలంలో ముక్తి

ఖట్వాంగుడు చక్రవర్తి. రాజ్యాన్ని పాలిస్తూ ఉన్నాడు. దేవ దానవ సంగ్రామంలో మహా శక్తివంతుడైన ఖట్వాంగుడు దేవతల వైపు నిలబడి రాక్షసులతో పోరాడాడు. విజయాన్ని సాధించిన దేవతలు ఖట్వాంగుని ప్రశంసించారు. ఏదైనా వరాన్ని కోరుకొమ్మని ఆజ్ఞాపించారు.



ఖట్వాంగుడు ఆలోచించి, తన మరణ కాలము ఎప్పుడో తెలియచేయ వలసిందిగా దేవతల్ని ప్రార్థించాడు. దేవతలు దివ్యదృష్టితో చూచి, ఇక కేవలం ముహూర్త కాలమే ఉంది అని నిప్పు లాంటి నిజాన్ని వినిపించారు. అంటే, కేవలం నలభై ఐదు నిముషాలు మాత్రమే ఖట్వాంగునికి జీవించే అవకాశం ఉంది. ఖట్వాంగుడు సమస్తాన్ని త్యజించాడు. మనస్సు బ్రహ్మము నందు నిలిపి, ఆ ముహూర్త కాలంలో తరించి పోయాడు.

తాను కేవలం ముహూర్త కాలము మాత్రమే జీవించే అవకాశం ఉందని దేవతల ద్వారా, జ్ఞానుల ద్వారా తెలుసు కొనిన రాజర్షి ఖట్వాంగుడు ప్రయత్నించి ముక్తిని సాధించాడు. నలభై ఐదు నిముషాల కాలంలో మృత్యు ముఖంలో ప్రవేశించ బోయే ఖట్వాంగుడు తరించి నపుడు, మేము ముసలివాళ్ళ మయ్యాం, తరిస్తామో లేదో! అని వృద్ధులు చింతించడం హాస్యాస్పదం కాదా?

దృఢమైన మనస్సుతో, ఆచార్యదేవుని అడుగుజాడలలో అకుంఠిత విశ్వాసంతో చరించే వారు జ్ఞానాన్ని పొంది తరించడానికి వయస్సు అవరోధం కాదు. అనారోగ్యం ప్రతిబంధకమూ కాదు. వివేక విచారాలకు నోచుకోని మనస్సు, సందేహాలకు నిలయమైన బుద్ధి, విశ్వాసం లేని చిత్తము, శ్రేష్ఠులను అర్థం చేసుకోలేని అహంకారము - ఇవే జ్ఞానానికి అడ్డుగోడలు. అవరోధాలు. మరణకాలంలో అయినా జ్ఞానాన్ని పొందే అవకాశం ఉంది. మరణానికి ఎవ్వరూ భీతి చెందాల్సిన అవసరం లేదు.

గీతామృతం మన వద్ద ఉంది. ఇక మరణ మెక్కడుంది? భగవంతుడు అందరినీ కనికరిస్తాడు. జ్ఞానము అందరినీ ఆశీర్వదిస్తుంది.

జ్ఞానమే ప్రధానం కనుక మరణశయ్యపై ఉన్న వారు కూడా తరిస్తారు. వృద్ధులైనా తరిస్తారు. రోగులైనా తరిస్తారు. జ్ఞానము బుద్ధికి అందేదే కనుక, ఏ జాతి వారైనా తరిస్తారు. ఏ మతం వారైనా తరిస్తారు. లింగభేదం లేదు. వర్ణభేదం లేదు. శ్రద్ధ ఒక్కటి ఉంటే చాలు. అంతా అభేదమే. అద్వైత జ్ఞానమే.



శ్రీ శంకరాచార్య స్వామి కృతం

ధన్యాష్టకం

ధారావాహిని-5

వ్యాఖ్య
శ్రీ స్వామీజీ

5వ శ్లోకము

శ్లో ॥ త్యక్త్వైషణత్రయ మవేక్షిత మోక్షమార్గాః
భైక్షామృతేన పరికల్పిత దేహయాత్రాః ।
జ్యోతిః పరాత్పరతరం పరమాత్మ స సంజ్ఞం
ధన్యా ద్విజా రహసి హృది అవలోకయన్తి ॥

త్యక్త్వా=విడిచి పెట్టి, ఏషణత్రయమ్=త్రివిధములైన వాంఛలను, అవేక్షిత మోక్ష మార్గాః=ముక్తి మార్గంలో పయనిస్తూ, భైక్షామృతేన=భిక్షామృతముచే, పరికల్పిత దేహ యాత్రాః= శరీర యాత్రను సాగించుట, జ్యోతిః=ప్రకాశము, పరాత్=పరముకంటే, పరతరం=పరమ మైనది పరమాత్మ సంజ్ఞం=పరమాత్మ యని పిలవబడే, ధన్యాః=ధన్యులు, ద్విజాః=ద్విజులు, రహసి= ఏకాంతమున, హృది=హృదయము, అవలోకయన్తి=దర్శించెదరు.

భావము :- ధనేషణ, దారేషణ, పుత్రేషణ యనెడి త్రివిధ వాంఛలను త్యజించి, భిక్షామృతమును స్వీకరించి దేహయాత్రను సాగిస్తూ, ఏకాంతవాసులై, పరాత్పరమైన పరమాత్మ తత్త్వమును హృదయములో ధ్యానించు ద్విజులు ధన్యులు.

వ్యాఖ్య

ఏషాఅంటే కోరిక. ఏషిన్అంటే కోరువాడు. ఏషణత్రయ మంటే త్రివిధ వాంఛలని అర్థము. అవియే (1) ధనేషణ (2) దారేషణ లేదా గృహేషణ (3) పుత్రేషణ లేదా లోకేషణ. మోక్ష మార్గములో ఇవి ప్రతిబంధకాలుగా యున్నందున వీటిని త్యజించాలి.

ధనేషణ

అవసరాలు వేరు; ఆసక్తి వేరు. ధనం అవసరాలు తీరేందుకు అవసరం. అంతేగాని, ధనమే అవసరం కారాదు. ధనమే అవసరంగా మారితే, కనీస అవసరాలు కూడా తీరక పోవుటయే గాక ధనాసక్తి పెరుగుతుంది. ఇక్కడ అవసరం ఆశగా మారుతుంది. అవసరానికి అవధి ఉంటుందేమో గాని ఆశకు హద్దు లేదు. ఆశ పెరుగుతుందే గాని తరగదు. తోడు పెట్టినా, తోడుపడినా పెరుగుతూనే ఉంటుంది. పెరుగు అవుతూనే ఉంటుంది. శాంతి తరుగుతూనే ఉంటుంది.

దారేషణ - గృహేషణ

ధనాసక్తి ఎలా ప్రతిబంధకమో కాంతాసక్తి, గృహాసక్తి కూడా అంతే. అంటే, భార్యను ప్రేమించటం తప్పా? ఇంటిని తీర్చి దిద్దుకోవటం నేరమా? అని అవగాహన లోపించిన వారు ఊగిపోతూ ఉంటారు.

భార్యను ప్రేమించటం తప్పు కాదు; భార్య లందరు పతి దేవుళ్ళను కోరేది అదొక్కటే. కలిసి జీవించే వారిని ప్రేమించకుంటే ఎలా? సమస్తాన్ని ప్రేమించ మని చెప్పే వేదాంతము కళత్రాన్ని ప్రేమించ వద్దని చెబుతుందా?

ప్రేమించటం వేరు. ఆసక్తి వేరు. ప్రేమ ఉందని భార్యకు ఏది జరిగినా గగ్గోలు పెట్టడం, తనకు ఏదో జరగలేదని గంతు లేయటం ఆరోగ్యానికి మంచిది కాదు. అతి స్నేహాలు ఆపదలకు, ఆవేదనలకు ఆహ్వానం పలుకుతాయి. ఏవి మనకు తోడైనా చెప్పి వచ్చినవి మాత్రము కావు. అందుకనే చెప్పకుండా పోతాయి. బ్రతుకే ఒక యాత్ర. పోయే వాళ్ళతో కలిసి పోవటం దోషం కాదు. కాని, పోయారని దుఃఖించటం, ఉండలేదని గుండె బాదుకోవటం మంచిది కాదు. ఇది అతి స్నేహం. అభిష్వంగం.

గృహం నిర్మించుకోవచ్చు. గృహాసక్తి పెంచుకో కూడదు. గృహంలో ఉండాలి. గృహం మనలో లేకుండా ఉండాలి. 'నాది' అనే మమకారం లేకుండా జీవించాలి. ఎందుకో తెలుసా? ఒకనాడు త్యజించి పోవాలి. కాని, మమకారం అనివార్యమైన అట్టి క్లిష్ట సమయంలో గుండెను కుదిపేస్తుంది.

ఒక ఆఫీసరు తన కార్యాలయాన్ని తనది గానే భావిస్తాడు. వస్తువు లన్నీ వినియోగించుకుంటాడు. కాని, బదిలీ కాగానే బాధ్యతల్ని అప్పగించి వెళ్తాడే గాని, భారంతో, బాధతో నిష్క్రమించడు.

గృహకళత్రాదుల విషయంలో అలా ఉన్నవారే కృతార్థు లవుతారు. అలా గాకుండా కొంపే కైలాస మనుకుంటే మాత్రం, కైలాసం విషయం ఈశ్వరుని కెరుక; కొంప కూలటం, కళేబరం కాలటం మాత్రం లోకాని కంతా ఎరుకే.

పుత్రేషణ - లోకేషణ

జీవన యాత్రలో వివాహం ఒక మజిలీ. అక్కడే ఆ సత్రం లోనే సంతానం వచ్చి చేరుతుంది. యాత్ర ఆగదు. అక్కడ నుండి సాగుతుంది. మొదట్లో లేని సంతానం మధ్యలో తోడవుతుంది. వారికి మనం నీడ అవుతాము. నీడ ఎప్పుడూ తోడు గానే ఉండదు. తోడుగా ఉన్న దంతా నీడ కాలేదు.

పుత్రుడు కలగటం, పుత్రోత్సాహము ఇవన్నీ మంచివే. పుత్రాసక్తి విషయం లోనే కొద్దిగా అవగాహన పెంచుకోవాలి.

'నా కొడుకు నా మాటే వినాలి' - వింటాడు చెవిటి వాడు కాకపోతే. ఆచరించాలని ఎక్కడుంది?

'నేను చూసిన అమ్మాయినే చేసుకోవాలి' - నిజమే. అంతకు ముందే, కళ్ళు న్నందుకు, ఆయన ఎవరినో చూశాడట. ఏం చేద్దాం?

'నేను చెప్పిందే చదవాలి', - మంచిదే. చెప్పేది మాష్టారు. చదివేది విద్యార్థి. నేను చెప్పిందే చదవాలి అంటే ఎలా? ఒకరి అభీష్టాన్ని మరొకరు భుజాని కెత్తుకొని మోయగలరా? మనకు పుట్టినంత మాత్రాన మనం చెప్పిన దంతా చేసేందుకే పుట్టారని భావించటంలో అర్థం లేదు.

మరి, పున్నామ నరకం విషయ మేమిటి? కాపాడితే కైలాసమే. నరకం నుండి కాపాడక పోయినా, నరకంలో తోయకపోతే అదే శ్రీరామ రక్ష అని భావించాలి.

మరి, కొరవి? అదెవరు పెడతారు? సరే, పెడతారనే అనుకుందాం. అప్పుడు చూచే దెవరు? చూచే వాళ్ళు అడగటం లేదు. అడిగే వాళ్ళు చూసేందుకు ఉండరు. ఎక్కడి బాధలు ఇవన్నీ? ఎందుకొచ్చిన బరువులు? బాధ్యతల్ని నిర్వర్తించటం - బరువుల్ని పడేయటం. ఇంతే. ఇది చేయగలిగితే ధన్యులు.

భిక్షామృతం

దేహ యాత్ర చక్కగా సాగాలంటే ఆహారం అవసరం. భిక్షాన్నమే దానికి మార్గము. అంటే, అడుక్కొని తినటం కాదు. లభించిన దానితో తృప్తి చెందటం. ఇక్కడే అన్నం అమృతంగా మారుతూ ఉంది.

లభించేది ఏదైనా ఈశ్వర ప్రసాదమే కనుక భగవంతుడు పెట్టిన భిక్షయే మనల్ని రక్షిస్తూ ఉంది అనే భావనతో ఆనంద యాత్ర సాగించాలి.

ఏకంత వాసము

కాలానికి మించిన కలిమి ప్రపంచంలో లేదు. తత్త్వ విచారము సాగించి, తత్త్వ విదులై తరించాలని అభిలషించే వారు లౌకిక కూపంలో పడదోసే జనసంగమును త్యజించి, ఎక్కువ కాలం ఏకాంతవాసం సాగించాలి. ఏకమేవాఽ ద్వితీయం బ్రహ్మ అనే సత్యాన్ని దర్శించాలనే పుణ్యాత్ములు ఏకాంతానికే ఎక్కువ ప్రాధాన్యత నివ్వాలి.

పరమాత్మ ధ్యానము

ఏకాంతము ఎందుకు? పరమాత్మ ధ్యానానికి. ధ్యాన సమయంలో నీవు, పరమాత్మ ఇద్దరే ఉండాలి. అందుకనే ఏకాంతవాసము.


(31వ పేజీ చూడుము)

రాజపోషకులు
రూ.5,000/-


శ్రీమతి వి.మాలతి
హైదరాబాద్


శ్రీమతి ఆర్.అమల
దౌలతాబాద్


శ్రీమతి బి.గిరిజ
ఖమ్మం


శ్రీ కె.వెంకటయ్య
హైదరాబాద్


శ్రీమతి టి.శకుంతల
హైదరాబాద్


శ్రీ వై.వి.కృష్ణా రెడ్డి
హైదరాబాద్


శ్రీమతి దివ్యశ్రీ
హొసూర్


శ్రీమతి రోజారాణి
వైజాగ్



శ్రీమతి ఎ.రోహిణి
ఒరిస్సా


శ్రీమతి యు.రజని
హైదరాబాద్


శ్రీ యు.పార్వతయ్య
హైదరాబాద్


శ్రీమతి బి.సాయమ్మ
హైదరాబాద్


శ్రీ పి.వెంకటేశ్
హైదరాబాద్


శ్రీమతి పి.లావణ్య లత
వైజాగ్



శ్రీమతి వై.తిరుపతమ్మ
హైదరాబాద్



శ్రీ బి.వి.దుర్గా ప్రసాద్
హైదరాబాద్


శ్రీ ఇ.సురేందర్ రావు
కరీంనగర్


శ్రీ వి.వి.ఎస్.సుబ్రహ్మణ్యం
హైదరాబాద్


శ్రీమతి ఎస్.శోభ
హైదరాబాద్



చి॥ జె.శ్రీప్రణవ్
హైదరాబాద్


శ్రీ డి.శ్రీనివాస్
హైదరాబాద్


శ్రీమతి ఆర్.విజయ
కరీంనగర్


శ్రీ కె.మహేశ్
హైదరాబాద్



కుమారి పి.శ్రీలేఖ
కర్నూలు


శ్రీ ఆర్.బాబ
హైదరాబాద్

ఆహార సమీక్షణము - 1

స్వామి సుందర చైతన్యానంద

అన్నం లేనిదే జీవి లేదు. జీవితం లేదు. మనిషి జీవించడానికి అన్నం అవసరం. బ్రతికినంత కాలం మనిషి అన్నం తింటూనే బ్రతకాలి. బ్రతికున్న మనిషికి అన్నం జీవనంగా ఉపయోగ పడుతుంది. అంతే కాని, అన్నం మనిషిని బ్రతికించ లేదు. అన్నం చావును ఆప లేదు.



అన్నం విషయంలో భారతీయ సంస్కృతి పాశ్చాత్య దేశాల అవగాహనకు విలక్షణంగా శోభిస్తోంది. బ్రతక డానికి ఆహారం అవసరం. అవసరమైన ఆహారం రుచిగా, శుచిగా, ఆరోగ్యకరంగా ఉండాలి. ఇది పాశ్చాత్యుల అవగాహన. జీవితంలో పాశ్చాత్యులు తమ కాలాన్ని ఎక్కువ శాతం అన్నానికే వినియోగిస్తారు. ఆహార సంపాద నకు, వంట వార్పులకు, తినడానికి - ఎక్కువ శాతం వారి కాలం ఇలాగే వినియోగ మవుతుంది. భౌతికంగా అవసరాన్ని తీర్చే ఆహారం మానసికంగా కూడా తృప్తి పరచేదిగా ఉండాలి అనేది వాళ్ళ అవగాహనలో భాగం కావడం చేత రుచులు ప్రాధాన్యతను పొందుతాయి. ఇది స్థూలంగా పాశ్చాత్య జీవన విధానంలో ఆహారానికి ఉన్న స్థానము.

కాకపోతే, కొన్ని ప్రత్యేక సందర్భాలలో ఆహార పానీయాలను తాత్త్విక కోణంలో ఊహించడం కూడా ఉంది. ఈ దృక్పథం మతపర మైంది. విశ్వాసానికి సంబంధించింది. అది కూడా ఎప్పుడో అరుదైన సందర్భాలకే పరిమితంగా ఉంటుంది. కొన్ని మతాలలో దైనందిన కార్యక్రమంలో కూడా సంకల్ప మాత్రంగా ఉన్నా, అది మనం ఇక్కడ విశ్లేషించ దగిన స్థాయికి సంబంధించింది కాదు. విస్మరించ దగిందే. ప్రత్యేక సందర్భాలలో ఆహారాన్ని తాత్త్విక కోణంలో వాళ్ళు దర్శించినా, దినసరి కార్యక్రమంలో సంకల్ప మాత్రంగా విశ్వసించినా, అదంతా అశాస్త్రీయము, హేతు భిన్నం కావడం చేత దానిని ఇక్కడ మనం విశ్లేషించ నవసరం లేదని భావిస్తున్నాను.

భారతీయ సంస్కృతిలో అన్నానికి ప్రశస్త మైన స్థానం ఉంది. అన్నం కేవలం రుచికి, ఆరోగ్యానికి, జీవనానికి మాత్రమే కాదు. చిత్తశుద్ధికి, మోక్షసిద్ధికి కూడా ఉపకరించే పవిత్ర సాధనంగా భారతీయులు దర్శించారు. అందుచేతనే ఆహారాన్ని అన్నం అని, భోజనం అని పవిత్రంగా పిలుచు కున్నారు. అన్నమును కేవలం ఆకలిని పోగొట్టి ఆరోగ్యాన్ని రాబట్టే పదార్థంగా కాకుండా, అన్నంలో సారభూతమైన దానిని గుర్తించి, ఆ సారభూతమైన దానిని సృష్టి స్థితి లయ కారణము, సత్తా స్ఫూర్తి ప్రదాయకమైన పరమేశ్వర స్వరూపంగా

దర్శించడము కూడా జరిగింది. అద్భుతమైన ఈ శాస్త్రీయ తాత్త్విక అవగాహనలో అన్నం బ్రహ్మ స్వరూపంగా దర్శన మిచ్చింది.

అన్నం బ్రహ్మేతి వ్యజానాత్ - అన్నమును బ్రహ్మముగా తెలుసుకో అని తైత్తిరీయ శ్రుతిలో భృగువు ప్రబోధము *(3 - 2)*.

అద్యతే భూతైః ఇతి అన్నమ్ - భూతముల చేత తినబడేది అన్నము. అంటే, అన్నరూపుడైన బ్రహ్మము జీవులలో ప్రవేశించి జీవుల్ని పోషిస్తూ ఉన్నాడు. ఇది ఒక అర్థము. మరొక అర్థాన్ని కూడా తెలుసుకుందాము.

అత్తి చ భూతాని ఇతి అన్నమ్ - భూతములను తినునది కనుక అన్నము. అన్న రూపంలో జీవనమై ప్రాణ రూపుడుగా ఉండి పోషించే బ్రహ్మమే దారి తప్పి, అయోగ్యమైన ఆహారాన్ని హద్దు మీరి భుజించి నపుడు జీవులను భక్షిస్తున్నాడు. ఈ విధంగా అన్న రూపంలో ఉన్న పరమేశ్వరుడు జీవులను రక్షిస్తూ ఉన్నాడు. అలాగే జీవుల్ని భక్షిస్తూ ఉన్నాడు. ఇది అన్నము శబ్దార్థము. ఇలా అన్నమును బ్రహ్మ స్వరూపంగా భావించడం చేత భారతీయ సంస్కృతిలో జీవించే వారికి అన్నము పవిత్ర మైనది.

జీవితం విలువైనది. ప్రశస్త మైనది. పవిత్ర మైనది. అట్టి జీవితము యొక్క మనుగడకు కారణమైన అన్నము కూడా పవిత్ర మైనదే. అలాగే భగవంతుడు పూజనీయుడు. అన్న రూపంలో ఉన్నది సత్తా రూపుడైన పరమేశ్వరుడే కనుక అన్నము కూడా పూజార్హమే. ఇది భారతీయుల అవగాహన. పాశ్చాత్యుల ఊహలకు అందని వాస్తవము.

కనుకనే, భారతీయులు అన్నాన్ని క్రింద పడ నివ్వరు. అసందర్భం కాదని భావించి నా వ్యక్తిగత మైన విషయం ఒకటి చెబుతాను. అది నా బాల్యదశ. భోజన సమయంలో కుటుంబము లోని వాళ్ళందరమూ ఒకే చోట ఒకే పంక్తిలో కలిసి భోం చేసే వాళ్ళం. మాతో పాటు పంక్తిలో మా నాన్నగారు కూడా కూర్చునే వారు. ఆయన గారిది భయంకరమైన క్రమశిక్షణ. ఆయన అంటే ఇంట్లో అందరికీ భయమే.

పద్మాసనంలో పీట మీద కూర్చున్నది మొదలు, ఎడమ చేయి క్రింద పెట్టడం, అన్నం మెతుకులు నేలపై పడటం, తుమ్మి నపుడు సంకల్పం చెప్పి వేళ్ళపై నీళ్ళు చల్లుకోవడం, చివరగా లేచి వెళ్ళి చేతులు శుభ్రం చేసుకొని తుడుచుకోవడం వరకు ఏదీ ఆయన దృష్టిని దాటి పోయేది కాదు. అడుగడుగునా అన్నీ ఆంక్షలే. దారి తప్పితే అక్షింతలే.

అన్నం మెతుకులు పొరపాటున క్రింద పడితే చాలు, వణికి పోయే వాళ్ళం. ఆ విషయంలో నేను చాలా జాగ్రత్తగా ఉండే వాణ్ణి. ఇంకెవరైనా పొరపాటున క్రింద పడేశారా! మా నాన్న గారు ఆదిశేషుడు పడగ విప్పినట్లే చూచేవారు. ఆయన పేరులో కూడా ఆ నామమే ఉండటం కారణ మేమో! క్రింద పడిన మెతుకుల్ని తిరిగి పళ్ళెంలో వేసుకొనే వరకు కళ్ళు ఆర్పేవారు కారు. 'అన్నంతో బ్రతుకు తున్నావు. అన్నం పరబ్రహ్మ స్వరూపం. అన్నాన్ని మట్టిపాలు చేస్తావా!' అని గద్దించే వారు.

బాల్యం కావడం చేత ఆ మాటలకు అర్థ మేమిటో, ఆ మాటల వెనుక పరమార్థ మేమిటో అప్పట్లో తెలిసేది కాదు. భయమో, భక్తో తెలియదు గాని నాకు బాగా జ్ఞాపక ముంది. నే నెప్పుడూ అన్నం క్రింద పడేయ లేదు. మా నాన్నగారి చేత ఆ విషయంలో తిట్టించుకో లేదు.

మన పవిత్ర భారతీయ సంస్కృతిలో సదాచారాలను పిల్లలకి బాల్యం లోనే పెద్దలు వంట పట్టించే వారు. ఆ సదాచారాల వెనుక సర్వాత్మ భావం ఎలా దాగి ఉందో ఆ పిల్లలే పెద్దలైన తరువాత గుర్తించే వారు.

బాల్యంలో నా మనస్సును గట్టిగా పట్టుకున్న సంస్కారము ఈ నాటికీ నాకు దూరం కాలేదు. ఇప్పుడు కూడా నేను భోజనం చేసే టప్పుడు ఆకు దాటి అన్నపు మెతుకు అవనిపై పడదు. ఆశ్రమంలో నాకు వడ్డించే టప్పుడు పొరపాటున మా ఆశ్రమవాసులు ఆకుకు దూరంగా మెతుకులు పడేస్తే, ఇప్పటికీ వాటిని ఎత్తి కళ్ళ కద్దుకొని ఆకులో వేసుకోవడం నన్ను వీడని ఆచారము. అది చూచి వాళ్ళు కూడా జాగ్రత్తగా వడ్డిస్తూ ఉంటారు.

పూర్వపు రోజుల్లో ఈ పద్ధతులు, ఆచారాలు ప్రతి ఇంటి లోను ఉండేవి. ఈ రోజుల్లో ఎక్కడా కనిపించని కారణంగా, ఆకులలో అన్నం వడ్డించినట్లు తెల్లని కాగితాల మీద నల్లని అక్షరాలను వడ్డించ వలసి వస్తోంది.

అన్నమును బ్రహ్మ స్వరూపంగా దర్శించడం చేత ఆహారమును నిందించడాన్ని మన పెద్దలు అంగీకరించరు. పైగా అట్టి నిందను గర్హిస్తారు. ***అన్నం న నింద్యాత్, తద్వ్రతమ్*** - అన్నమును నిందించ కూడదు. అది వ్రతము అన్నది తైత్తిరీయోపనిషత్ *(3 - 7)*.

అన్నం భగవ దనుగ్రహంగా మనకు లభిస్తుంది. అన్న రూపంలో భగవంతుడే ఉన్నాడు. అన్నాన్ని చిన్న చూపు చూస్తే, అలా చూచిన వాడి కనుచూపు పోతుంది అనే వాళ్ళు మన పెద్దలు. మనకు ప్రాతః స్మరణీయులు.

కాని, ఈ రోజుల్లో అన్నాన్ని చిన్న చూపు చూడటమే కాదు, భోజన సమయాలలో కొన్ని కుటుంబాలలో పళ్ళెములే రెక్క లొచ్చి ఎగురుతూ ఉంటాయి. అక్కడికి చేరింది ఈ రోజు మన సంస్కృతి. అన్నం మెతు కైనా పళ్ళెం నుండి క్రింద పడితే సహించని పుణ్యాత్ములకు వారసులమైన మనం పళ్ళెములను అన్నంతో సహా విసిరి కొట్టే స్థాయికి ఎదిగాము. ఎంత దురదృష్టం!

ఈ దురదృష్టాలు, దురాచారాలు ఎందుకని ఆవిష్కృత మౌతున్నాయి? ఏముంది! రుచి లేదని కొందరు. ఆశించింది పళ్ళెం లోకి రాలేదని ఇంకొందరు. ఈ రెండే కారణాలు కనబడు తున్నాయి. వాస్తవానికి ఈ రెండూ మన సంస్కృతిలో మన పూర్వీకులకు తెలియని విషయాలే.

మనది రుచి చూచే సంస్కృతే గాని రుచిని ఆశించే సంస్కృతి కాదు. ఇది మొదట అర్థం కావాలి. ***స్వాద్వన్నం న తు యాచ్యతాం*** - స్వాదు అన్నం అంటే రుచికరమైన భోజనము.

రుచికరమైన ఆహారాన్ని ఆశించకు అన్నారు ఆచార్యులు. అంతే కాదు. ఏది ప్రాప్తిస్తే దానిని సంతోషంగా, తృప్తిగా ఆరగించ మన్నారు ***(విధి వశాత్ ప్రాప్తేన సంతుష్యతాం)***.

ఏది మనకు లభిస్తే అదే మనది. అది అలా ప్రాప్తించడం వెనుక ఎంతో నేపథ్యం ఉంది. నియతి ఉంది. నియంత నిర్ణయా లున్నాయి. అందే వన్నీ కర్మఫలాలే. కర్మఫల ప్రదాత పరమేశ్వరుడు. మన కర్మలకు ఫలితాలే మనకు అందుతున్నాయి. రావలసినవే వస్తున్నాయి. లేనివి రమ్మంటే ఎలా వస్తాయి? ఇవన్నీ జీవన సత్యాలు. ఇవి అర్థం కాక పోవడం చేత, మన సంస్కృతికి మనం దూరం కావడము చేత సంతోషించ వలసిన చోట సంతాపానికి గురి అవుతున్నాం. మతి చెడిన వాళ్ళ లాగా ప్రవర్తిస్తున్నాం. మనస్సు లోని చాంచల్యము కారణంగా పళ్ళెములే పక్షులై గాలిలో ఎగురు తున్నాయి.

అన్నం న పరిచక్షీత - అన్నమును పడేయకు. అన్నమును నిరాకరించకు అని వేదమాత ఆదేశం. అన్నమును విసిరి వేయడ మంటే అన్న రూపుడైన పరమేశ్వరుని విసిరి వేయడం కాదా? ఎవరు చేస్తారు ఈ పని? కంసుడు చేస్తాడు. శిశుపాలుడు చేస్తాడు. ఖరుడు చేస్తాడు. శూర్పణఖ చేస్తుంది. వాళ్ళది ఆసురీ సంపద. వారిలో సత్త్వగుణం లేదు. అందుకే వాళ్ళు అలా చేస్తారు. కాని, మనం అలా చెయ్యలేము. చెయ్య కూడదు. అన్నమును దూరం చేసుకో కూడదు. శ్రమించి అన్నాన్ని ప్రోగు చేసుకోవాలి.


అన్నం బహు కుర్వీత తద్వ్రతమ్ - అన్నాన్ని ఎక్కువగా పొంది, దానిని వినియోగించడం జీవితంలో వ్రతం కావాలి అన్నది ఉపనిషత్తు. దాని అర్థం ఎక్కువగా అన్నదానం చేయ మని. పరమేశ్వరుడు అందరి వాడు. అందరిలో ఉన్న వాడు. అందరిలో ఉన్న వాడి ముచ్చటను అందరితో కలిసి అవలోకించి, అనుభవించి, ఆనందించి, తరించ మనేదే ఉపనిషత్తు సందేశము లోని కేంద్ర విషయము.

అన్నంతో మనం బ్రతుకు తున్నాం. అన్నంలో సార రూపంగా పరమేశ్వరుడే ఉన్నాడు. అన్నమును అనుగ్రహించేది, తినిన అన్నాన్ని వంట బట్టించేది కూడా పరమేశ్వరుడే. ఈ విషయాలన్నీ పూర్వాధ్యాయా లలో తృప్తిగా చెప్పుకున్నాం. అన్నం విషయంలో అన్ని విధాల పరమేశ్వరుడే దర్శనీయ మవుతున్నాడు. కనుక అన్నము దైవ ప్రసాదము. ఈశ్వర ప్రసాదము.

నైవేద్యము పెడితేనే ప్రసాదము ప్రాప్తిస్తుంది. ధనం లేనిదే నైవేద్యం తయారు కాదు. నైవేద్యానికి ఉపకరించేది కనుక ఆ ధనం కూడా ధర్మ సంపాదనై ఉండాలి అని మన పెద్దలు ఆలోచించే వాళ్ళు. ధర్మ బద్ధంగా జీవించి, ధనమును సంపాదించి, శుచిగా దేహాన్ని, ప్రసన్నంగా మనస్సును ఉంచుకొని వంట తయారు చేసి, ఆరాధనా భావంతో ఆహారాన్ని ప్రసాదంగా స్వీకరించి, ఈ వ్యవహారాన్నంతా ఆత్మోన్నతికి, ఆత్మ సాక్షాత్కారానికి సాధనగా వినియోగించుకొనే వాళ్ళు. అందుచేత, ఆహార విషయంలో నైవేద్యము - ప్రసాదము అనే దివ్యమైన భావాలు భారతీయులకు ఉండేవి. కనుక, యోగ్యమైన, యోగమునకు ఉపయుక్త మైన, ఆరోగ్యకరమైన, ఆనంద దాయకమైన ఆహారాన్నే భారతీయులు గ్రహించే వారు. ఆహారం విషయంలో ఇది భారతీయులకు ఉండే అవగాహన.

కామక్రోధాలు

స్వామి సుందర చైతన్యానంద



ఇష్ట విషయానికి సంబంధించిన మనోవృత్తి, లేదా వృత్తి విశేషమే కామము. విషయాలు బయట ఉంటాయి. కామము ఇచ్ఛా విశేషంగా మనస్సులో ఉంటుంది. కామనా బుద్ధి చేత మనస్సు బాహ్య వ్యాపారాల లోకి ప్రవేశించడానికి ఇష్ట వస్తువు కారణ మవుతుంది. మనస్సు యొక్క బాహ్య ప్రవృత్తికి హేతువు కామమే. విషయేచ్ఛకు విఘాతం కలిగినపుడు కలిగే చిత్తవృత్తియే క్రోధము.

కామక్రోధాలు బుద్ధిని కలత పెడతాయి. కలుషితం చేస్తాయి. కామక్రోధాలు ఉన్నాయి అంటే, వాటిని కదిలించిన రాగద్వేషాలు మనస్సులో ఉన్నాయి అని అర్థము. రాగద్వేషాలు మల దోషానికి సంబంధించినవి కనుక బుద్ధిని అశుద్ధం చేస్తాయి. కామక్రోధాల చేత కలుషితమైన బుద్ధి విచలిత మవుతూ ఉంటుంది. కామక్రోధాలు జ్ఞాన ప్రాప్తికి ప్రతిబంధకా లవుతాయి. కనుక, సాధకుడు వీటిని అరికట్టి తీరాలి. వీటిని నియమిస్తేనే జ్ఞానానికి అర్హత ప్రాప్తిస్తుంది.

కామః ఇచ్ఛా విషయేషు తస్య ప్రతిహతౌ జాతా చిత్త వృత్తిః క్రోధ ఇతి ఉచ్యతే, తదుభయ పరిత్యాగే ధ్యానాకారి భవేత్ - విషయముల యందలి ఇచ్ఛయే కామము. విషయేచ్ఛకు విఘాతం కలిగినపుడు కలిగే చిత్తవృత్తియే క్రోధము. ఈ రెండిటిని త్యజించిన వాడు ధ్యానానికి అర్హుడవుతాడు.

సర్వ అనర్థాలకు కారణమైన కామక్రోధాలను అవగాహనతో జయించాలి. అది ఊహించినంత సులభమైన కార్యం కాదు. కాని, పవిత్రమైన ప్రయత్నాలు తప్పక ఫలిస్తాయి. ఈ విషయంలో మన ప్రయత్నాలు విచారరూపంలో, ఆచారరూపంలో దృఢంగా సాగాలి. పరమేశ్వరుని అనుగ్రహం తోడు కావాలి. భగవంతుని దయను పొందటానికి అలౌకిక కర్మలైన పూజ, జప, ధ్యాన, స్వాధ్యాయాలను ప్రారంభించాలి. మన కృషి, భగవత్కృప రెండూ కలిస్తే కామక్రోధాలు అదృశ్య మవుతాయి. మోక్ష మార్గము సుగమ మవుతుంది.


కామక్రోధాలను నిగ్రహించకుండా మోక్ష సాధనమైన జ్ఞానమును పొందడము చాలా కష్టము. కామక్రోధాలను జయించిన వానికే మనోనిగ్రహము కలుగుతుంది. నిగ్రహం కలిగిన మనస్సే శాస్త్రాధ్యయనం చేసి జ్ఞానమును సముపార్జించ కలుగు తుంది. జ్ఞానం కలిగి నపుడే మోక్షం సిద్ధిస్తుంది. కనుక, అక్షయ సుఖాన్ని పొందాలని అభిలషించే వాడు కామక్రోధాలను అవశ్యం నియమించాలి.


(24వ పేజీ చూడుము)


మహారాజ పోషకులు
(రూ.10,000/-)


శ్రీమతి జి.వినోదిని
హైదరాబాద్
రూ.21,000/-


సుందర సత్సంగ్
పిప్పరవాడ
రూ.21,001/-


శ్రీ ఎ.రంగయ్య
హైదరాబాద్
రూ.20,000/-


శ్రీ జి.వెంకట రమణా రెడ్డి
హైదరాబాద్
రూ.20,000/-



శ్రీమతి ఎస్.ఎస్.కాంతం
హైదరాబాద్
రూ.20,000/-



శ్రీమతి కె.లక్ష్మి, శ్రీ కె.శివరాం
హైదరాబాద్
రూ.20,000/-



శ్రీమతి సి.హెచ్.అన్నపూర్ణ
శ్రీ సి.హెచ్.సీతారామ శాస్త్రి
హైదరాబాద్



శ్రీమతి కె.హేమలత
శ్రీ కె.సత్తయ్య
హైదరాబాద్


శ్రీమతి జె.లక్ష్మి
హైదరాబాద్


శ్రీ కె.సమ్మిరెడ్డి
వరంగల్



శ్రీ ఎమ్.నాగరాజు
హైదరాబాద్


శ్రీ డి.కిషన్ రావు
హైదరాబాద్



శ్రీ ఎమ్.వెంకటయ్య
హైదరాబాద్


చి॥ కె.సుధ
హైదరాబాద్


శ్రీమతి వి.సీతాదేవి
హైదరాబాద్


శ్రీమతి అనసూయ
హైదరాబాద్

మహారాజ పోషకులు
(రూ.10,000/-)


శ్రీ జి.ప్రతాప్ కాశ్యప్
హైదరాబాద్



సుందర సత్సంగ్
విజయవాడ


శ్రీమతి జి.అమృత
హైదరాబాద్


శ్రీమతి జె.దుర్గా భవాని
హైదరాబాద్



శ్రీ జె.అరవింద్
హైదరాబాద్


శ్రీ రాధాకృష్ణ
హైదరాబాద్



శ్రీ ఎస్.సూరిబాబు
శ్రీకాకుళం


చి॥ ఎన్.ఆద్విక్
హైదరాబాద్


చి॥ సోముప్రియ
చి॥ మోక్షప్రియ
హైదరాబాద్



శ్రీ కె.వెంకటశేషా రెడ్డి
నెల్లూరు


శ్రీమతి జి.చంద్రకళ
నెల్లూరు


శ్రీ ఎస్.ఎస్.వి.ఎస్.ఆర్.శాస్త్రి శర్మ
వైజాగ్


శ్రీమతి ఎ.సంపత్ లక్ష్మి
కీలమంగలం


శ్రీమతి ఎమ్.జస్విత
శ్రీ ఎమ్.శ్రీకర్ రెడ్డి
హైదరాబాద్


చి॥ సి.హెచ్.రవి కిరణ్ రెడ్డి
హైదరాబాద్


శ్రీమతి కె.వసంత
హైదరాబాద్

(21వ పేజీ తరువాయి)

కామక్రోధాలు ప్రశస్త మైనవి కావు. శ్రమించి పొందడానికి ఐశ్వర్యాలు కావు. సుగుణాలూ కావు. అలాగని ప్రాప్తించి ఉన్నట్లయితే, వాటిని అలాగే ఉంచుకోవడానికి అవి అవసరాలలో ఉపకరించేవీ కావు. అలాగని ఉపద్రవాలను తయారు చేయనివీ కావు. కనుక వాటి విషయంలో సాధకులు అప్రమత్తులై ఉండాలి. ప్రతిబంధకాల నడుమ ప్రగతిని సాధించడం కష్టం. అవరోధాలను తొలగించుకోకుండా అభివృద్ధి సాధ్యం కాదు. మోక్షరూపమైన శ్రేయోమార్గంలో ఇది కడు అవసరనీయం. అనుసరణీయం.

కామం విషయంలో మనసు అయోమయంగా ఉంటుంది. నేను కోరుతున్నది కోర దగిందే అనే సంకల్పంతో ప్రారంభమై, ఎలాగైనా అది నాకు దక్కాలి అనే దృఢమైన కోరికగా మారుతుంది. ఆ కోరిక ఏదైనా కావచ్చు. ధనం కావచ్చు. గృహం కావచ్చు. పదవి కావచ్చు. కీర్తి కావచ్చు. కుక్క కావచ్చు. కోతి కావచ్చు. కోతి లాంటి మనిషి కావచ్చు.

కామం స్థాయిలో మనస్సు బలహీనంగా ఉంటుంది. వివేకానికి గ్రహణమే పడుతుంది. ఎవరు చెప్పినా, ఏమి చెప్పినా, ఎలా చెప్పినా కామికి రుచించదు. కామం ఈ స్థాయికి రాకుండా సాధకులు జాగ్రత్త పడాలి.


కోరికల్ని కదిలించే శక్తి మనిషి మనసుకు ఉంది. కోరిన ప్రతి దానిని సాధించు కొనే శక్తి మాత్రం మనిషికి లేదు. మనిషి సర్వాన్ని కోరుకోవచ్చు. కాని, సర్వాన్ని పొందటానికి తనకు సర్వశక్తిమత్వం లేదు అనేది మరచి పోకూడదు. సాధారణంగా కోరిన వన్నీ లభించవు. ప్రతి మనిషి జీవితంలో ఆశించేవి ఎక్కువ, అందుకొనేవి తక్కువ. ఆశించడానికి స్తోమత అవసరం లేదు. అందుకోవటానికి సామర్థ్యం కావాలి.

కోరింది లభ్యం కానపుడు మనిషి క్షోభకు గురి అవుతాడు. కలత చెందుతాడు. తన కోరిక ఫలించక పోవటానికి కారణ మేదో దానిపై క్రోధం పెంచుకుంటాడు. ప్రతిబంధకం పై ప్రకోపంతో రెచ్చిపోతాడు. ఇదే క్రోధం. కామం విఫలం కావడం వల్ల ఏర్పడిన పరిణామం. ప్రతిఫలం.

క్రోధానికి కామమే కారణము. కామం నుండే క్రోధం ఉద్భవిస్తుంది. క్రోధము మనస్సును క్రుంగ దీస్తుంది. బుద్ధిని వికలం చేస్తుంది. వివేకాన్ని హరించి వేస్తుంది. క్రోధంలో మనస్సు ఆలోచనా శక్తిని కోల్పోతుంది. నిర్ణయించే శక్తిని బుద్ధి జారవిడుచు కుంటుంది. క్రోధం వల్ల సమ్మోహము ఏర్పడుతుంది. మోహంలో చిక్కిన వాడు బయట పడలేడు. మోహజాలంలో కూరుకు పోయిన వాడు మోక్షాన్ని ఎలా పొందు తాడు? కనుక మోక్షాన్ని అభిలషించే ముముక్షువులు కామక్రోధాలను జయించి తీరాలి.

ఆచార్యులే అవనిలో మణిదీపాలు

స్వామి సుందర చైతన్యానంద



మనుషులలో మతు లుంటాయి. మతులలో స్మృతు లుంటాయి. అవే జ్ఞాపకాలు. జ్ఞాపకాలైతే అందరికీ ఉంటాయి. ఉన్నవే కనుక జ్ఞాపక మొస్తాయి. కొన్ని జ్ఞాపకాలు మధురంగా ఉంటాయి. కొన్ని చేదుగా ఉంటాయి.

తీయని స్మృతులే జ్ఞాపకం వస్తూ ఉండాలి అని మనం భావించవచ్చు. అంతేకాదు, చేదు జ్ఞాపకాలు రాకూడదు అనేది కూడా మన అభిమతం కావచ్చు.

మనం అనుకున్నట్లు జ్ఞాపకాలు రావు. వాటికి అవిగా వస్తాయి. వచ్చినవి ఊరకే పోవు. చేదునో, తీపినో పంచిపెట్టి మరీ వెళ్తాయి. ఇలాంటి సమయాల్లోనే మనస్సు పొంగటము, క్రుంగటము జరుగుతూ ఉంటుంది.

స్టేట్ ర్యాంక్ సాధించి పరీక్ష పాసైన రోజు, ఎంతో వైభవంగా సాగిన పెళ్ళిరోజు, ఆశించి సాధించిన ఉద్యోగంలో ప్రవేశించిన మొదటిరోజు, తొలిసారి పుట్టిన బిడ్డను చూసుకొని పరవశించిన క్షణాలు, - ఇలాంటివి జ్ఞాపక మొస్తే మనస్సు కొన్ని క్షణాలు ఆనంద డోలికల్లో ఊగిపోతుంది. ఊహల్లో సంబర పడిపోతూ ఉక్కిరిబిక్కిరి అవుతుంది.

అలా కాకుండా, తల్లిదండ్రులు శాశ్వతంగా దూరమైన క్షణాలు, ప్రేమలు మోసం చేసిన నిముషాలు, కష్టార్జితాన్ని సులభంగా పరులు దోచేసుకున్న కాలాలు, చేయని నేరానికి శిక్షలు, నిష్కారణంగా బ్రతుకును ముంచెత్తిన అవమానాలు, అపనిందలు, అభియోగాలు - ఇలాంటివి జ్ఞాపక మొస్తే మనస్సు ఏదో పూడిక తెలియని అగాధంలో ప్రయాణం చేస్తున్నట్లు ఉంటుంది. అవును. జ్ఞాపకాలు అలాగే ఉంటాయి.

తీయని జ్ఞాపకాలే ఎప్పుడూ ఉండాలి అనుకుంటాము కనుక అలాంటి జ్ఞాపకాల్ని నెమరు వేసుకొనేందుకు ఉపకరించే రోజుల్ని పండుగరోజులుగా మలచుకుంటాం. పుట్టినరోజులు, పెళ్ళిరోజులు అలాంటివే.

అయితే ఇక్కడ ఒక్క విషయాన్ని మనం అర్థం చేసుకోవాలి. సాధారణ విషయాలు - అంటే, స్నానం చెయ్యడం, భోంచేయడం, తల దువ్వుకోవడం, క్షౌరం చేసుకోవడం, తట్టుకొని పడటం, విరగబడి నవ్వటం లాంటివి మన జీవితం లోనే జరుగుతూ వున్నా అవి జ్ఞాపకం రావు.

జ్ఞాపకం వచ్చేవి ఏవయినా సరే, అవి గాయం చేసి బాధించేవి అయినా ఉంటాయి. లేదా, తాయం పెట్టి సుఖపెట్టే వయినా ఉంటాయి. పెళ్ళిరోజు తియ్యని అనుభూతిగా ఉంటే, తల్లి మరణించిన రోజు చేదు అనుభూతిగా ఉంటుంది.

కాని, పదేపదే జ్ఞాపక మొస్తూ, అలా వచ్చే జ్ఞాపకము సుఖాన్ని పంచకుండా, దుఃఖంలో ముంచకుండా, సుఖదుఃఖాలకు అతీతంగా తీసికొని వెళ్ళి ఒక అలౌకిక ఆనందధామంలో పవ్వళింప చేసే జ్ఞాపకాల రోజు ఏదైనా ఒకటి ఉంటే అది గురువుకు సంబంధించిన రోజు అయి ఉంటుంది. అదే గురుపూర్ణిమ. ఇది సుఖదుఃఖాలకు సంబంధించిన స్మృతులను పంచేరోజు కాదు. సుఖదుఃఖాలను అధిగమించిన అనుభూతికి సంబంధించిన రోజు. జ్ఞానానికి సంబంధించిన పవిత్రమైన రోజు.

జలం కావాలంటే జలాశయాల్నే ఆశ్రయించాలి. జ్ఞానం కావాలంటే జ్ఞానుల్నే ఆశ్రయించాలి. వెలిగే దీపమే మరొక దీపాన్ని వెలిగిస్తుంది. జ్ఞానులు వెలిగేదీపాలు. ఆరనిదీపాలు, అమరదీపాలు, అద్భుతదీపాలు.

ఉపదేక్ష్యన్తి తే జ్ఞానం జ్ఞానినః తత్త్వదర్శినః

అర్జునా! తత్త్వమును దర్శించిన ఆచార్యులు నీకు జ్ఞానాన్ని బోధిస్తారు. వారి నాశ్రయించి జ్ఞానాన్ని పొందాలి అన్నాడు గీతలో శ్రీకృష్ణ పరమాత్మ.

శాస్త్రం తెలిసిన వారు శాస్త్ర విషయాన్ని చెప్పగలరు. కాని, అలా చెప్పేవారు తత్త్వాన్ని దర్శించిన వారై ఉండాలి. గురువులు అంటే కేవలం శాస్త్రాన్ని మాత్రమే చెప్పేవారు కారు. శాస్త్రం యొక్క అర్థం తామే అని ఎరిగినవారు. అలా శాస్త్రతాత్పర్యం తామే అని తెలిసిన వారు కనుక శిష్యునికి అర్థమయ్యే లాగ బోధించగలరు. ఇదే ఉపదేశం.

జ్ఞానం కోసం గురువులను సమీపిస్తాము. గురువును సమీపించగనే జ్ఞానార్జన ప్రారంభం కావాలి. దప్పికతో బాధపడే వ్యక్తి జలాశయాన్ని చేరగానే వెంటనే పానం చేయడం ఆరంభిస్తాడు. అంతేగాని, ఏదో ఆలోచిస్తూనో, దిక్కులు చూస్తూనో, లేదా మరొకటి ఆశిస్తూనో కూర్చోడు.

మోక్షపిపాస శిష్యునికి ఉండాలి. తీర్థరూపుడైన ఆచార్యుడు లభ్యం కావాలి. అంతే. దప్పిక తీరినట్లే. దరి చేరినట్లే. మోక్షం సిద్ధించినట్లే.

ఈ ప్రపంచంలో గురువులు ఉన్నారు. గురువుల వద్ద జ్ఞానం ఉంది. కాని, బోధించాలి అనే దురద వారికి ఉండదు. తెలుసుకోవాలి అనే అభిరుచి గలవారు, జ్ఞానాన్ని పొందాలి అనే అభిలాష గలవారు అడిగితే జ్ఞానులు బోధిస్తున్నారు.

శిష్యస్తేఽహం శాధిమాం త్వాం ప్రపన్నం

కృష్ణా! నిన్ను ఆశ్రయించాను. నాకు ఉపదేశించు అని అర్జునుడు అడిగాడు. కృష్ణుడు

బోధించాడు. పరీక్షిత్తు అడిగితే శుకబ్రహ్మ బోధించాడు. వాల్మీకి అడిగితే నారదుడు బోధించాడు. జనమేజయుడు అడిగితే వైశంపాయనుడు బోధించాడు. శౌనకాదిమునులు ప్రార్థిస్తే సూతమహర్షి బోధించాడు.

నీరు అంతా ఒక్కటే. ఎవరు త్రాగితే వారి దప్పిక మాత్రమే తీరుతుంది. జ్ఞానము కూడా ఒక్కటే. ఎవరు పొందితే వారికే ఉంటుంది. ఎవరు ఎవరి నుండి జ్ఞానాన్ని పొందినా వారు అలా అందించిన వారికి శిష్యులు అవుతారు.

లేనివారు అడిగితే ఉన్నవారు అందించడం పవిత్రజీవనం. ధర్మజీవనం. అలాంటి పవిత్ర ఆదర్శమూర్తులే గురువులు. ఆచార్యులు. అవనిలో మణిదీపాలు.

శిష్యులైన వారికి గురుపూర్ణిమకు మించిన పండుగ మరొకటి ఉండదు. గురుశిష్య సంబంధ మనేది పితృపుత్ర సంబంధం లాంటిది. తండ్రిలాంటి వారు ఎందరైనా ఉండొచ్చు. కాని, తండ్రి ఒక్కడే. తల్లి లాంటివారు ఎందరైనా ఉండొచ్చు. కాని, తల్లి ఒక్కతే.

ఎవరు బోధించినా వినవచ్చు. అందరూ గురువులే. కాని ప్రతి శిష్యునికి ఒక గురువు ప్రత్యేకంగా ఉంటాడు. శిష్యులైన వారు వారి వారి గురువుల్ని ఆరాధించుకొనే, అర్చించుకొనే పండుగే గురుపూర్ణిమ.

గురువు లందరిలో శోభించే జ్ఞానం ఒక్కటే. వేర్వేరు శిష్యులకు గురువులు వేర్వేరుగా ఉన్నా, వారు అందించిన జ్ఞానం మాత్రం ఒక్కటే. జ్ఞానాన్ని అందించిన గురువును అందరూ ఒకే రోజు అర్చించుకొని ఆనందించాలంటే, అలాంటిరోజు అందరికీ ఆమోద యోగ్యంగా ఉండాలి. అదే వ్యాసపూర్ణిమ. వ్యాసమహర్షి గురువులకు గురువు. ఆచార్యులకు ఆచార్యుడు. ఆయన మన జాతినిర్మాత. సంప్రదాయప్రదాత.

మోక్షం జ్ఞానరూపంలో ఉంది. జ్ఞానం వేదంలో ఉంది. జ్ఞానానికి ఆది లేదు. కనుక వేదానికి కూడా ఆది లేదు. వేదము ఎప్పుడు వచ్చింది? అని అడిగితే సమాధానం చెప్పలేము. కాని, వేదము వ్యాసుని నుండి అందినది అని చెప్పగలం. అందుకే ఆ మహర్షి వేదవ్యాసుడుగా స్తవనీయు డయ్యాడు. భగవాన్ వేదవ్యాసుడు అని శ్రీశంకరాచార్యులే కీర్తించారు.

వేదవాఙ్మయం

ప్రపంచ మనుగడకు ధర్మమే మూలాధారము. విశ్వాన్ని ధరించేది, భరించేది ధర్మమే. ధర్మరూపంలో దైవం ఉన్నందు వల్లనే విశ్వంలో ధారణపోషణలు సాగుతున్నాయి. **(ధారణాత్ ధర్మః).** అంతేకాదు. అభ్యుదయ నిశ్శ్రేయసల సిద్ధికి ధర్మమే మూలంగా ఉంది.

అట్టి ధర్మానికి వేదాలే మూలం **(వేదోఖిలో ధర్మమూలం).** వ్యాసునికి ముందు వేదాలు ఉన్నాయి. కాని ఒక క్రమంలో లేకుండా చెల్లాచెదరై ఉన్నాయి. వాటిని సంస్కరించి

ఒక రూపాన్ని ప్రసాదించాడు వ్యాసభగవానుడు. అంతేకాదు. వేదప్రచారానికి నడుం బిగించి తన శిష్యులైన సుమంతునికి ఋగ్వేదాన్ని, వైశంపాయనునికి యజుర్వేదాన్ని, జైమిని మహర్షికి సామ వేదాన్ని, పైలునికి అధర్వణవేదాన్ని ప్రసాదించి వారి ద్వారా జనావళికి సంప్రదాయాన్ని ప్రసాదించాడు. అందుకే ఆయన వేదవ్యాసు డయ్యాడు.

మహాభారతం

వేదాన్ని అర్థం చేసుకోలేని వారి కొరకు వేదధర్మాన్ని అందిస్తూ మహాభారతాన్ని లక్ష శ్లోకాల్లో రచించారు. అందుకే భారతాన్ని పంచమవేదం అని ప్రస్తుతించడం జరిగింది. మహాభారతం కేవలం కథ గాదు; చరిత్రే కాదు. అందులో వేదవిజ్ఞాన మంతా నిక్షిప్తమై ఉంది.

ఉపనిషత్సారమైన భగవద్గీత భారతం లోనే ఉంది. తాత్త్విక విషయాలను నిగూఢంగా చర్చించిన సనత్సుజాతీయము, ధర్మానికి సంబంధించిన విదురనీతి, యక్షప్రశ్నలు అందులోనే ఉన్నాయి. ముఖ్యంగా మహాభారతం అనుశాసనపర్వంలో విష్ణుసహస్రనామం, శివసహస్రనామం రెండూ శోభిస్తున్నాయి. ఇదంతా వ్యాసప్రసాదమే.

పురాణవైభవము

సామాన్య జనులలో కూడా ధర్మాసక్తి, పవిత్రభక్తి కలిగే లాగ పద్దెనిమిది పురాణాలను వ్యాసమహర్షి రచించారు. పురాణాలను తక్కువగా అంచనా వేయకూడదు. అన్ని కాలాలకు, అందరి వ్యక్తులకు ఉపకరించే ఎన్నో ఉపాఖ్యానాలు, ఉపదేశాలు అందులో ఉన్నాయి.

నాలుగులక్షల శ్లోకాలలో పద్దెనిమిది పురాణాలను అందించిన ఘనత ఆ మహర్షిదే. స్కాందపురాణము ఒక్కటే లక్షశ్లోకాల గ్రంథం. మిగిలిన పదిహేడు పురాణాలు మూడులక్షల శ్లోకాలలో ఉన్నాయి.

పురాణాలలో కథలున్నాయి. చరిత్ర ఉంది. భూగోళం ఉంది. తాత్త్విక విషయా లున్నాయి. ధర్మనిర్ణయా లున్నాయి. కళలు పుష్టిగా శోభించాయి. నాలుగు లక్షల శ్లోకాలలో పురాణాలను వ్యాసమహర్షి రచించి జనావళిని అనుగ్రహించి ఆశీర్వదించారు.

బ్రహ్మసూత్రాలు


వేదాంతము అంటే ఉపనిషత్తులు. ఉపనిషత్తులలోని విజ్ఞానము యొక్క సునిశ్చితార్థాన్ని నిర్ణయించేందుకు న్యాయప్రస్థానంగా బ్రహ్మసూత్రములను వ్యాసులవారు రచించారు. 'గురుపూర్ణిమ'గా మనం జరుపుకుంటున్న ఆషాఢపూర్ణిమ నాడే శ్రీ వ్యాస భగవానుడు బ్రహ్మసూత్రముల రచనను ప్రారంభించాడు.

నూనె అంటే నువ్వులనూనె అని అర్థం. తైలము అన్నారు అంటే తిలల నుండి తీయబడినది అని అర్థము. అదే నువ్వులనూనె. వేరే ఏదైనా నూనెను ప్రస్తావించాలి అనుకున్నప్పుడు కొబ్బరినూనె, వేపనూనె, శెనగనూనె అంటారే గాని నూనె అని అనరు.

(32వ పేజీ చూడుము)

ఉన్నది వాస్తవానికి ఆనందమే

స్వామి సుందర చైతన్యానంద



నీకు ఎన్నో తెలిసుంటాయి. తెలిసిన వన్నీ సత్యంగా తెలిసిన వేనా? ఏమో! తెలిసినవి కొన్ని సత్యం కాకపోవచ్చు. సత్యమైనవి కొన్ని తెలియక పోవచ్చు. ఏవి తెలిసినా, ఏవి తెలియక పోయినా, నిన్ను గూర్చి నీకు తెలియాలి అని ఉంటుంది. అలా తెలియాలి అంటే, నీకు సంబంధించిన సత్యం నీకు తెలియటానికి మనస్సు ఒక స్థితికి చేరాలి. అలా చేరిన మనస్సులో నీకు సంబంధించిన కల్పితాలు దూరమై ఉండాలి. ఈ విషయంలో స్పష్టత ఉండాలి.

'నేను జ్ఞానం లేనివాణ్ణి. దేనికీ ఉపయోగపడని వాణ్ణి' అని నిన్ను నీవు ఖండించు కుంటూ పోతే, ఒక దశలో నీ వేమిటో నీకే అర్థం కాకుండా పోతావు. ఇది మనస్సులో అస్పష్టతను సృష్టిస్తుంది. స్పష్టతను దూరం చేస్తుంది. స్పష్టత లేని మనస్సులో ఏ సత్యమూ అర్థం కాదు.

అలా అర్థం గాని మనస్సు సత్యాన్ని శ్రవణం చేసినా అర్థం చేసుకోలేదు. నీవు జ్ఞానివి అని శాస్త్రం చెబుతుంది. ఈ సత్యాన్నే గురువు బోధిస్తాడు. బోధ జరుగుతున్నంత కాలం అంతా అర్థమైనట్లే ఉంటుంది. నీవు నీకు తెలిసినట్లే ఉంటుంది. గురుబోధ సమాప్తం కాగానే విన్నదంతా మరుగున పడి పోతుంది. అంతా అస్పష్టంగా ఉంటుంది.

నేను ఏదీ తెలియని వాణ్ణి. నన్ను జ్ఞాన స్వరూపునిగా గురువు చెబుతా డేమిటి? నాకు తెలియాల్సింది నేనేనా? నేను పొందాల్సింది నన్నేనా? నీవు విన్నది నీకు అర్థమైనదో కాదో తెలియదు గాని, నీవు శ్రవణం చేసిన దానిపై నీకు సందేహము ఏర్పడింది. స్పష్టత లోపించింది ఏదైనా, అది కల్లోలమే. ఈ విషయంలో కరోనా ప్రత్యేకం కాదు.

ఇంతకీ గురువు బోధించింది, శాస్త్రము ప్రతిపాదించింది జ్ఞానమేనా? జ్ఞానమే అయితే, అది నాకు ఎందుకు ఉపకరించదు? జ్ఞానం ఉంది. కాని, ఉపకరించడం లేదు. ఎందుకని? ఏదో ప్రతిబంధకము ఉంది. ఏమిటది? అది ఏదో కాదు. మనస్సే. అస్పష్టతతో కూడుకున్న మనస్సే. స్పష్టత లేని పాత మనస్సే. అదే సంసారము.

అజ్ఞానా దేవ సంసారో జ్ఞానాదేవ విముచ్యతే ।
జ్ఞాన స్వరూప మే వాదౌ జ్ఞానం జ్ఞేయైక సాధనమ్ ॥

'అజ్ఞానము వల్లనే సంసారము కలుగుతూ ఉంది. జ్ఞానము సంసారము నుండి విడుదల చేస్తూ ఉంది. కనుక మొదట జ్ఞానమును సంపాదించాలి (అజ్ఞానమును

తొలగించుకొని). జ్ఞానము ద్వారా జ్ఞేయమును తెలియాలి' అన్నది ఉపనిషత్తు.

జీవితం లోని వాస్తవాలకు, మనం వాటిని అర్థం చేసుకొనే విధానానికి మధ్య ఏదో అంతరం ఉంది. అంతు చిక్కని అగాధ ముంది. ఇలాంటి చోటే మనస్సులో ఘర్షణ ఏర్పడుతుంది. అవగాహనలో స్పష్టత లోపిస్తే, ఘర్షణ ప్రారంభ మవుతుంది. సంఘర్షణ అలుము కుంటుంది. అలాంటి చోటే కరోనా ద్విగుణీకృత మవుతుంది.

అంతః శీతలతాయాం తు
లబ్ధాయాం శీతలం జగత్ ।

'అంతరంగము చల్లబడితే ప్రపంచం చల్లబడుతుంది' అన్నది ఉపనిషత్తు.

అంతరంగము చల్లబడాలి అంటే, మనస్సు లోని నిర్ణయాలు చల్లగా ఉండాలి. మనస్సు ప్రశాంతంగా ఉండాలి. అలజడి లేకుండా ఉండాలి. ఘర్షణలు తలెత్తకుండా ఉండాలి. అస్పష్టత వల్లే ఘర్షణలు తలెత్తుతాయి. స్పష్టత లోపించినపుడే సంఘర్షణలు తలెత్తుతాయి. అలా విజృంభించిందే కరోనా. నీ సంకల్పము స్పష్టంగా ఉన్నా, అస్పష్టంగా ఉన్నా నీ సంకల్పానికి నీవే ఆధారము. నీ సంకల్పానికి ఉనికి నీవే. నీలో ఏ సంకల్పమైనా నీ ప్రతిబింబమే. సూర్యుని ప్రకాశం వల్ల చంద్రుడు ప్రకాశించినట్లు, నీ ప్రకాశం వల్లనే నీ సంకల్పం భాసిస్తుంది. అలాంటప్పుడు నీ ప్రతిబింబమైన నీ సంకల్పము నిన్ను కలత పెడుతుందా? కలవర పెడుతుందా? నీపై ఆధారపడిన నీ సంకల్పము నిన్ను బాధించలేదు. కరోనా ఏమిటి? అదీ సంకల్పమే. అది నిన్ను ఎలా బాధిస్తుంది?

మనస్సు మారుతుంది. మనస్సులో ఉన్న వన్నీ వృత్తులే. వృత్తులు మారుతున్నా, వృత్తుల మధ్య మారని ప్రశాంత స్వరూపంగా నిన్ను నీవు దర్శించాలి. సంకల్పాలు ఉంటే, సంకల్పాల మధ్య నీ శాంతి స్వరూపాన్ని నీవు దర్శించాలి. సంకల్పాలు లేనపుడు, నీవు నీవుగా శాంతి స్వరూపంగా భాసించాలి.

నీవే సత్యము. సత్యమైన నీ కన్నా వేరుగా ఏముంది? ఒకవేళ అలాంటింది ఏదైనా ఉంటే అది వాస్తవానికి ఉన్నది కాదు. లేనిదే. లేకుండా ఉన్నట్లున్నదే.

న కించిదస్తి తద్వ్యతిరిక్తం (నీ కన్నా అన్యమైనది ఏదియును లేదు), తద్వ్యతిరిక్తం యత్కించిత్ ప్రతీయతే (నీ కన్నా వేరుగా ఏదయినా ఉన్నట్లు తెలిస్తే) తత్సర్వం బాధిత మితి నిశ్చితమ్ (అదంతా లేనిదే అని నిశ్చయము) అన్నది ఉపనిషత్తు.

నీవే ప్రశాంతి. ప్రశాంతతను పొందటానికి నీవు ప్రయత్నించ నవసరం లేదు. నీవు పూర్ణము. పూర్ణము దేనినీ కోరదు. పూర్ణము ప్రశాంతమే. కనుక, పూర్ణానికి ప్రశాంత చిత్తము అవసరం లేదు. అశాంతి తెలియని దానికి ప్రశాంత చిత్తము ఎందుకు? ఇది ఎంతగా అర్థమైతే, అంతగా వ్యక్తిలో ఆనందము ఉంటుంది.

ఇదే జ్ఞానమార్గము. జ్ఞానంలో మార్గమూ ఆనందమే. గమ్యము కూడా ఆనందమే. ఏ కలత తెలియనిదే పూర్ణత్వము. ఏ ఆనందమైనా పూర్ణత్వమే. ఇది వృత్తి కాదు. వృత్తి

ఉంటే, వ్యక్తి కర్త అవుతాడు. కర్తకు వృత్తి తప్పదు. వృత్తి చైతన్యము లోనే ఉంటుంది. కనుక కర్తృత్వ మనేది 'నేను' అనే అహంకారమే. ఇక్కడ ఒక్క విషయం అర్థం కావాలి. వృత్తి చైతన్యము మీద కేంద్రీకృతమై ఉన్నదే గాని, చైతన్యము వృత్తిపై ఆధారపడి లేదు. ఈ సత్యాన్ని అంగీకరించడంలో వృత్తిని తొలగించడము కాదు. వృత్తికి ఆధారమైన సత్యాన్ని అర్థం చేసుకోవడమే.

వృత్తి నడిచినా, కర్మ జరిగినా, 'అహం' అనేది ఉంది. కానీ, ఆత్మ కర్మ నుండి విడిపడి ఉంది. ఎందుకని? ఆత్మ అహం కాదు కనుక. ఆత్మ అనేది కర్మ కాదు, మార్గము కాదు, ఆచరణ కాదు, ఫలమూ కాదు. ఈ సత్యము తెలియగానే, అలా తెలిసిన వాడు కర్మలో నిష్క్రియత్వాన్ని దర్శిస్తున్నాడు.

'తత్త్వమసి' అనే ఆయుధమును ప్రయోగించగానే, 'అహం' నశించిపోతూ ఉంది. కనుక, అహంకారము నశించడానికి నీవు ఏమి చేయ నవసరం లేదు. వేదాంత జ్ఞానాన్ని పొందితే చాలు. ఆ తరువాత, ఏవి ఉన్నా, నిన్ను ఏమి చేయలేవు. కరోనా ఉంటే ఏమి? కైవల్యాన్ని ఆపగలదా?

యస్త్వనేన మార్గేణ సమ్య గాచరతి స నారాయణో భవ త్య సంశయ మేవ! ఎవడు ఈ మార్గమును చక్కగా అనుసరించి ఆచరించునో అతడు నారాయణుడే అవుతున్నాడు. ఈ విషయాన సందేహము లేదు.

(15వ పేజీ తరువాయి)

ధ్యానం చేసే వ్యక్తి యొక్క హృదయం ప్రశాంతంగా ఉండాలి. భారంగా ఉండ కూడదు. అందుచేతనే, ప్రతిబంధకా లైన బరువుల్ని, బాధల్ని హృదయం నుండి ఎలా నెట్టెయ్యాలో ఇంతవరకు చూశాము.

ఇప్పుడు ఏకాంతంలో ధ్యానము సాగుతూ ఉంది. నిర్జన ప్రదేశంలో కళ్ళు మూసి ధ్యానం చేస్తున్న పుణ్యాత్మునితో ఎవ్వరూ లేరు. ఆయనలో ఎవరిని గూర్చి ఆలోచన లేదు. దేనిని గూర్చి అలజడి లేదు. ధ్యానం చేసే పుణ్యమే తనకు తోడుగా ఉంది. శుద్ధి పడిన అంతఃకరణే సహకారిగా ఉంది.

ఇతడు ధన్యుడు. అందరి లాంటి వాడు కాడు. గతంలో ఉన్న తన లాంటి వాడు కూడా కాడు. ఈ జన్మ లోనే అతడు పునర్జన్మ నెత్తాడు. అందుకే ద్విజుడు. ఈ జన్మ కృతార్థ మైంది. ధన్యమైంది. కనుక తాను ధన్యుడు. హృదయంలో పరమాత్మ ధ్యానమును సాగించువా రందరూ ధన్యులే.

(సశేషం)

(28వ పేజీ తరువాయి)

అలాగే వేదాంతము అని ఒక్క మాట పలికితే అది అద్వైత మనే అర్థము. వేరే ఏదైనా సిద్ధాంతాన్ని ప్రస్తావించాలి అనుకున్నప్పుడు ఒక విశేషణాన్ని, లేదా మరో పదాన్ని తగిలించుకోవాలి. భావాద్వైత వేదాంతము, శుద్ధాద్వైత వేదాంతము, విశిష్టాద్వైత వేదాంతము అని అంటారు గాని వేదాంతము అని అనరు.

'అథాతో బ్రహ్మ జిజ్ఞాసా", "జన్మాద్యస్యయతః", "శాస్త్రయోనిత్వాత్", "తత్తు సమన్వయాత్" - ఈ నాలుగు సూత్రాలు 550 శ్లోకాలతో శోభించే బ్రహ్మసూత్రాలలో ప్రారంభ సూత్రాలు. వీటినే "చతుస్సూత్రీ" అంటారు. సర్వ వేదాంతసారాన్ని ఈ నాలుగు సూత్రాల లోనే అందించ గలగటం వ్యాసునికి తప్ప మరొకరికి సాధ్యపడే పని కాదు. అందుచేతనే ఈ "చతుస్సూత్రీ"పై అనేక వ్యాఖ్యానాలు వెలుగు చూశాయి.

'బ్రహ్మసూత్రములు' అనేది సామాన్యమైన గ్రంథము కాదు. ఉపనిషత్తుల లోని అద్భుతమైన వాక్యాలను ఎంపిక చేసుకొని, వాటిని సూత్రబద్ధం చేసిన విజ్ఞాన సుమ హారమే బ్రహ్మసూత్రములు అని శ్రీ శంకరాచార్యస్వామి భాష్యంలో అభిప్రాయపడ్డారు. **(వేదాంత వాక్య కుసుమ గ్రథనార్థత్వాత్ సూత్రాణామ్).**

ఒక్క వ్యక్తి అందించిన జ్ఞానము చుట్టూ తిరుగుతోంది ఆర్ష సంస్కృతి. ఈ పవిత్రమైన జ్ఞానంతో భారతీయ సంస్కృతి యావద్విశ్వాన్ని ప్రభావితం చేస్తోంది.

వ్యాసునికి వందనం

వ్యాసభగవానుడు సర్వలోకహితేరతుడు. అంటే, ఇతరుల మేలును వీక్షించి సంతసించేవాడు. కనుకనే లోకకళ్యాణమును వాంఛించి ఇన్ని గ్రంథాలు రచించాడు.

విరబూయకుండా మొగ్గలాగ ఉన్న వేదకమలాన్ని వికసింపజేసిన జ్ఞానభాస్కరుడు. సూర్యుడు లేకపోతే పద్మం వికసించదు. వ్యాసుడు దర్శన మివ్వకపోతే మనకు వేదమే ప్రాప్తించేది కాదు. అందుచేత ఆయన వేదాబ్జభాస్కరుడు.


మహాజ్ఞాని

వ్యాసదేవుడు త్రికాలజ్ఞుడు. భూతభవిష్య ద్వర్తమానముల యందు జరిగే విషయాలన్నీ ఆ మహాత్మునికి తెలుసు. సంజయునికి దివ్యనేత్రాన్ని ప్రసాదించి, కురుక్షేత్రంలో జరిగే విషయాలను వీక్షించడం, వినడమే కాకుండా ఎవరెవరి మనస్సులలో ఏయే ఊహలు నడుస్తున్నాయో ఏయే కల్పనలు సాగుతున్నాయో వాటిని కూడా గ్రహించి ధృతరాష్ట్రునికి వినిపించే శక్తిని ప్రసాదించడం ఊహకు అందే విషయం కాదు. ఆయన మహిమ వర్ణనాతీతం. అట్టి శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుని గురుపూర్ణిమ పర్వదినాన సంప్రదాయాలు వేరైనా, సిద్ధాంతాలు వేరైనా ముముక్షువు లందరు చేతములను ఏకంచేసి, చేతులను పువ్వులతో పెనవేసుకొని పూజించటం ముదావహం. మహద్భాగ్యం.

కృష్ణద్వైపాయనం వ్యాసం సర్వలోక హితేరతమ్
వేదాబ్జ భాస్కరం వందే శమాది నిలయం మునిమ్ ॥

నడిచే భగవద్గీత

శ్రీ వోలేటి పార్వతీశం
ప్రొడ్యూసర్, దూరదర్శన్



'ఏడుస్తూ వస్తావు - ఏడిపించి పోతావు
నడి మధ్యన కాసేపున్నా నిజం తెలుసుకోలేవు'

జీవితాన్ని అంతర్లీనంగా ప్రతిఫలిస్తున్నాయి ఈ వాక్యాలు -

పుట్టినప్పుడు ఏడుపుంది, పోయినప్పుడూ ఏడుపుంది. రెండు ఏడుపుల మధ్య విరామమే మన జీవితం. కనీసం ఆ కాస్త విరామాన్ని కూడా కలతలకి, కన్నీళ్ళకి, దూరంగా గడపలేక పోతున్నాడు మనిషి. ఎందుచేత?

ప్రశ్న వేసినంత సులభం కాదు దీనికి సమాధానం చెప్పడం. మనుషు లంతా ఒకటే రూపురేఖల తోటి, వర్ణమూ వర్చస్సు తోటి ఎలా పుట్టడం లేదో, అలాగే, ఈ ప్రశ్నకి సమాధానం కూడా ఒకే తీరుగా గోచరించదు.

తీరని కోరిక వల్ల కొందరికీ, అసూయ వల్ల మరి కొందరికీ, అవిద్య వల్ల మరి కొందరికీ, ఇలా కారణం ఏదైనా, మొత్తంగా, అందరికీ అశాంతిగానే వుంది.

మనిషికి జీవితంలో అశాంతి అనేది తప్పడం లేదు. నిజమే, అలా అని, అది తప్పడం లేదని, సరిపెట్టుకోవడ మేనా? తప్పించుకొనే మార్గాన్ని అన్వేషించ నవసరం లేదా?

అవసరం మనిషికి ఎదురు పడినప్పుడు, అసాధ్యం అన్నది అతనితో తలబడలేదు. ఇది చరిత్ర చెబుతున్న సత్యం.

చరిత్ర పుటల్ని ఒక్కసారి తిరగేస్తే, అశాంతికి ఆలవాలమైన మానవ జీవన సాగరాన్ని ఆధ్యాత్మిక చింతన అనే మందరంతో మథించి, అమృత తుల్యమైన శాంతిని సాధించిన యోగి పుంగవుల చిరునామాలు అనేకం లభ్యం అవుతాయి. ఈ విషయం మీకూ,

నాకూ, మనందరికీ తెలియనిది కాదు. అయినా, తెలియనట్టే వుంటాం. ఆ మహానీయులు చూపిన ప్రశాంత మార్గం కళ్ళముందే ఉన్నా మనం పట్టించుకోము. అదే మనిషి నైజం. తెలిసున్నా తెలియనట్లు వుండడమే మనిషి లక్షణం. మరో చెడు లక్షణం వుంది మనకి. కోతి నుంచి పుట్టిన మనం, కోతి చేష్టలు వదిలి, నాగరికత నేర్చుకుని, సంస్కారవంతులుగా రూపుదిద్దుకొని, సభ్య సమాజంలో అడుగుపెట్టాం. కాని, అక్కడ మితిమీరిన తెలివితేటలు ప్రదర్శించి, విచక్షణ కోల్పోయి మళ్ళీ కోతి చేష్టలే, కోతులుగా మారే ప్రయత్నాలే.

ఇలా మూర్ఖత్వానికి బందీ అయి, ఈ సభ్య సమాజం భ్రష్టు పట్టి పోతున్న తరుణంలో హైందవ ధర్మంలో నిబిడీకృతమైన, ఉత్కృష్ట తత్త్వాన్ని ప్రజల ముందు ఆవిష్కరించి సమాజాన్ని పునరుజ్జీవింప చేసిన మహానుభావులకు మనం శిరస్సు వంచి నమస్కరించాలి.

అలా మన ప్రణతుల్ని నిత్యం అందుకొనే అర్హత ఉన్నవారు రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద ఇత్యాదులు. మానవాళికి మరో దౌర్భాగ్యం వుంది. అదే మనిషి కనుమరుగైతే తప్ప అతని ఘనతను గుర్తించలేని తనం. బహుశా, ఈ కారణంగానే, నేటితరంలో పూజనీయులై ప్రణతులు అందుకుంటున్న, రామకృష్ణ పరమహంస వంటివారు తమ జీవితకాలంలో అంతగా గుర్తింపుకు నోచుకోలేదు. వారి ప్రవచనాలు చిత్త చాంచల్య భాషణాలుగానే ఎక్కువ ముద్ర వేసుకున్నాయి. కాని యిప్పుడు మనం సాలోచనగా గతంలోకి అవలోకిస్తే, రామకృష్ణ పరమహంస, వివేకానందుల వంటి మహనీయలు మన హిందూధర్మ పునరుద్ధరణకు తమ జీవితాన్ని అంకితం చెయ్యకుంటే, నేడు మన సమాజం ఏ దుస్థితిలో ఉండేదో మన ఊహకి కూడా అందని విషయం.

ఆ తరహా మహనీయుల కోవకి చెందిన మాననీయు లొకరు ఈ తరంలోనూ ఉన్నారు. ఆయనే శ్రీ స్వామి సుందర చైతన్యానంద. వారికి సమకాలీనులమై జీవిస్తున్నందుకే మనమంతా గర్వపడాలి. అది మన అదృష్టం అనుకోవాలి.


వికటించిన నాగరికత ప్రభావంతో నేడు, వెఱ్ఱితలలు వేస్తున్న ఆలోచనలను, సమూలంగా నిర్మూలించే ప్రయత్నంలో, హైందవ ధర్మతేజాన్ని వియత్తల పర్యంతం వికసింప జేయడానికి, మరొక పర్యాయం అవతరించిన అపర వివేకానందులు, శ్రీ స్వామి సుందర చైతన్యానందులు. స్వామి ప్రవచన ప్రభావం, ప్రజావాహినిని స్పృశించిన క్షణాన, అక్కడ సాగర చైతన్యం! అది ఆనందార్ణవ స్పందనం!

గీతాజ్ఞాన ప్రవచనాలతో, మానవాళి అశాంతిమయ జీవనమార్గంలో, ప్రశాంతి ద్వారాలను తెరుస్తున్న ధన్యజీవి వారు.

సత్యాన్ని శివ (దైవ) పరంగా ఆవిష్కరిస్తున్న సుందర చైతన్యానికి మూర్తి కడితే, అది వారి రూపురేఖా విలాసాలను సంతరించుకుంటుంది.

ఆయన ఒక నడిచే భగవద్గీత!
ఆ ప్రవచనం సాగే రసవద్ఘంగ.....!!

⁂ ⁂ ⁂



శ్రీమతి సి.పద్మ


భక్తి సేవల గని - గోదావరిఖని

జూన్ 21 వ తేది ఆదివారం ఆశ్రమం వచ్చిన భక్తులు గోదావరిఖని సుందర సత్సంగ్ సభ్యులు. 1989 వ సంవత్సరంలో గురుదేవుల అమృత హస్తాల మీదుగా ప్రారంభించబడిన ఈ సత్సంగం గత 38 సంవత్సరాలుగా శ్రీ భాస్కర్ గారి ఆధ్వర్యంలో ఎంతో ఆధ్యాత్మిక స్ఫూర్తితో కొనసాగింది. వారు స్వర్గస్తు లైనారు. ఆ వెలితిని భర్తీ చేస్తు వారి కుటుంబ సభ్యులు, ఇతర ప్రముఖులు సత్సంగాన్ని ఎంతో భక్తి ప్రపత్తులతో, సేవా కార్యక్రమాలతో కొనసాగిస్తూ గురుదేవుల హృదయంలో తమ స్థానాన్ని చెక్కు చెదరనీయక పదిలపరచుకో గలగడం సభ్యుల మధ్య ఉన్న పరస్పర అవగాహనకు, సహకారానికి నిదర్శనం.

2010 సంవత్సరంలో గురుదేవులచే స్థాపించబడిన మురళీకృష్ణ మందిరంలో నేటికీ భక్తి కార్యక్రమాలు, నిత్య కైంకర్యాలు ఘనంగా జరుగుతూ ఉంటాయి. ప్రతి పండుగకు పల్లకీ సేవ, నగర సంకీర్తన; ప్రతి మాసం ఏకాదశి, పౌర్ణమి ఇత్యాది పుణ్య తిథులలో భగవద్గీత, విష్ణుసహస్రనామం, భాగవత, రామాయణ పారాయణాలు, అఖండనామ సంకీర్తనలు, సామూహిక అర్చనలు, అన్నదానాలతో ఆలయ ప్రాంగణమంతా కళకళ లాడుతూ ఉంటుంది. వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తారు. చలికాలంలో దుప్పట్లు, కంబళ్ళు వితరణ చేస్తారు. నిరంతరం భక్తి, సేవా కార్యక్రమాలలో సత్సంగ సభ్యులు నిమగ్నమై ఉంటారు.

వేదికపైన గురుదేవులు తాము పాడబోయే క్రొత్త గీతికను గురించి వివరిస్తూ :

"గిరిధారి మాసపత్రిక ప్రారంభమై సలభై ఒక్క సంవత్సరాలు గడిచాయి. నాటి నుండి నిర్విఘ్నంగా, నిరాటంకంగా కొనసాగుతున్న ప్రచురణ నేటికి సుమారు ఐదు వందల సంచికలను పూర్తి చేసుకుంది. ప్రారంభ దశలో నేను వ్రాసిన ఒక సంపాదకీయం పేరు ***'అజ్ఞానమా! అంతరించు'***. ఆ రోజుల్లో ఇంటర్నెట్ లేదు. స్వయంగా ఆర్టిస్ట్‌తో చిత్రాలు గీయించే వాడిని. ఆ సంపాదకీయానికి బొమ్మ ఉరిత్రాడు. ఆ వలయాకారంలో **'అజ్ఞానము'** అని వ్రాసి క్రింద ఈ సందేశాన్ని వ్రాశాను, **'అజ్ఞానమా! ఆది లేకనే ఆరంభమైన నీకు అంతరించే సమయం ఆసన్నమైంది'**. చివరలో ఒక పాటను కూడా వ్రాసి సంతకం



చేశాను. ఆ పాటను మీకు పాడి వినిపిస్తున్నాను. ఇది ఏ సి.డి లోను మీకు దొరకదు. కనుక పాతదే అయినా నూతనమే. నిత్యనూతనమే", అని అన్నారు.

కార్యక్రమం అనంతరం అర్వై మందికి పైగా వచ్చిన గోదావరిఖని సుందర సత్సంగ సభ్యులకు పూజ్య గురుదేవులు ప్రత్యేకంగా దర్శన భాగ్యాన్ని అనుగ్రహించారు.

పాట

పల్లవి : సరిజేయ వచ్చితివా గిరిధారి
సిరులను నమ్మిన మా దరి జేరి ॥ సరి ॥

చరణములు :


(1) నిరతము త్వరితము దేహము మారి
కొడిగట్టిన జ్ఞాన దీపము ఆరి
పోవుట తథ్యము ఆయువు తీరి
మేలుకొమ్మని మమ్ముల గోరి ॥ సరి ॥

(2) కాలము చూడగ మాయలమారి
రామనామమే పువ్వుల దారి
శాంతి సలిలము ఏరుగా పారి
తరియించు మార్గము తెలుప గోరి ॥ సరి ॥

గురు మార్గానుయాయులు - పిప్పరవాడ సుందర సత్సంగ్

జూన్ 28వ తేది మోక్షధామం తరగతికి హాజరైన భక్తులు ఆదిలాబాద్ జిల్లా - పిప్పరవాడ సుందర సత్సంగ్ సభ్యులు. అర్వై మందికి పైగా అరుదెంచిన సభ్యులను ఆశీర్వదిస్తూ గురుదేవులు వేదికపై నుండి ఇలా పలికారు :

"పిప్పరవాడ సత్సంగ్ ఎంతో భక్తి పూర్వకంగా, ఆదర్శవంతంగా జరుగుతూ ఉంది. చిన్న గ్రామమే అయినా అక్కడకు ఒకసారి నేను వెళ్ళినపుడు ఎంతో ఘనంగా పాదపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేల సంఖ్యలో చుట్టు ప్రక్కల గ్రామాల నుండి కూడా వచ్చిన భక్తులను చూచి నేనెంతో పొంగిపోయాను. వెంకట్ రెడ్డి దంపతులు, వారి బిడ్డలు అందరు ఎంతో స్ఫూర్తితో సత్సంగ కార్యక్రమాలను నడుపుతూ ఉంటారు. వారి కేంద్రం లోనే కాకుండా ఆశ్రమానికి కూడా వారి ప్రాంతమంతా ఎంతో సేవ లందిస్తూ ఉంటుంది. వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఆ సత్సంగ్ చాలా పెద్ద కేంద్రంగా మారగలదని ప్రగాఢంగా విశ్వసిస్తూ, వారికి నా హృత్పూర్వక ఆశీస్సులను అందిస్తూ ఉన్నాను".



కృష్ణభక్తి పరాయణులు - మాండగడ సుందర సత్సంగ్

జూలై 5 వ తేది గురుదేవుల ఆశీస్సులకై ఆశ్రమం అరుదెంచిన భక్తులు మాండగడ సుందర సత్సంగ్ సభ్యులు. ఆదిలాబాద్ సుందర సత్సంగ్ అధ్యక్షులు డా॥ నరసింగా రెడ్డి స్వగ్రామం మాండగడ. వారి స్ఫూర్తితో, ప్రోత్సాహంతో ప్రారంభమైన మాండగడ సుందర సత్సంగ్ అచిరకాలం లోనే ఒక చక్కటి మురళీకృష్ణ మందిరాన్ని - సత్సంగ భవనాన్ని నిర్మించుకోగలిగింది. అత్యంత సుందరమైన శ్రీ మురళీకృష్ణ పాలరాతి విగ్రహాన్ని వారికి ప్రసాదించి గురుదేవులు వారిని ఆశీర్వదించడం కూడా జరిగింది.

శ్రీ విఠల్ రెడ్డి గారి ఆధ్వర్యంలో మాండగడ సుందర సత్సంగం అత్యున్నత స్థాయికి ఎదిగింది. అక్కడ ఆలయంలో నిత్యము జరిగే కార్యక్రమాలు చుట్టు ప్రక్కల గ్రామాలను కూడా ఎంతో ప్రభావితం చేస్తూ ఉన్నాయి అనే విషయం సర్వులకు ఎంతో స్ఫూర్తి దాయకం.

ఆనాటి ప్రవచనానంతరం పూజ్య గురుదేవులు రచించిన క్రొత్త భజనను శ్రోతలందరూ పరవశించి గానం చేశారు. ఆ పిదప శ్రీ ఏచూరి రంగయ్య, డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (రిటైర్డ్), వారి సతీమణి శ్రీమతి భారతమ్మ పూజ్య గురుదేవులను వేదిక మీద భక్తి పూర్వకంగా సన్మానించారు.



చైతన్య భజన


జానకి జీవన జగదభి రామ
దానవ భంజన సీతారామ ॥ జానకి ॥
సుందర వదన వందిత చరణ
కరుణా సాగర రామా
ఆర్తి నివారణ రామా ॥ జానకి ॥
రామ రామ రామ రామ
రామ రామ రామ్ ॥ జానకి ॥

ఉద్యమానికి పచ్చతోరణం - తొర్రూర్ సత్సంగ్

జూలై 12వ తేది ఆశ్రమం అరుదెంచిన గురుబిడ్డలు తొర్రూర్ సుందర సత్సంగ సభ్యులు. ఈ సత్సంగాన్ని 1997వ సంవత్సరంలో వరంగల్ సుందర సత్సంగ్ కార్యకర్తలు డా॥ నరసింహా రావు, డా॥ బాపురావు గారు పూజ్య గురుదేవుల ఆశీస్సులతో ప్రారంభించారు. వారి సలహాలను పాటిస్తూ ఎంతో క్రమశిక్షణతో, భక్తితో ముందుకు సాగిన తొర్రూర్ సత్సంగం నేడు మూడు పూవులు ఆరు కాయలుగా ప్రవర్ధమాన మయింది.

2010 సంవత్సరంలో వీరు నిర్మించుకున్న శ్రీమురళీకృష్ణ మందిరంలో పూజ్య స్వామీజీ తమ అమృత హస్తాలతో విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక కార్యక్రమాలను

నిర్వహించారు. శ్రీ మోహన్ రెడ్డి, శ్రీ రమేష్, శ్రీమతి జమున ఆధ్వర్యంలో ఆలయంలో నిత్య కైంకర్యాలు, నగర సంకీర్తనలు - భాగవత, రామాయణాది పారాయణలు, వందలాది సువాసినులచే సామూహిక శ్రీ లలితా, విష్ణుసహస్రనామార్చనలు జరుగుతూ ఉంటాయి.



పర్వదినాలలో అన్నదానాలతో, జ్ఞానదానాలతో ఆలయ ప్రాంగణ మంతా శోభిస్తూ ఉంటుంది. భగవద్గీత గ్రంథాల ఉచిత పంపిణీ మరియు బడిపిల్లలకు భగవద్గీతా శ్లోకాలను తాత్పర్య సహితంగా నేర్పటంలో శ్రీ రమేష్ దంపతులు నిరంతరం నిమగ్నమై ఉంటారు.

ఆశ్రమానికి కూడా ఈ దంపతులు అందించే సేవలు ఎంతో ఆదర్శవంతంగా ఉంటాయి. ముఖ్యంగా ప్రతి సంవత్సరం వచ్చే రెండు సదస్సుల లోను సురభి వారి సహకారంతో అద్భుతమైన సాంస్కృతిక కార్యక్రమాలను వీరు ఏర్పాటు చేస్తూ గురుదేవుల అనుగ్రహానికి పాత్రు లవుతుంటారు. హైదరాబాద్ ఆశ్రమంలో ఏ నూతన కట్టడాన్నైనా అందమైన హరివిల్లుగా తీర్చి దిద్దడంలో వీరు భాగస్వాములై ఉంటారు. మోక్షధామం తరగతి అనంతరం సుమారు 70 మంది సభ్యులకు పూజ్య గురుదేవులు తమ మందిరంలో ప్రత్యేక దర్శన భాగ్యాన్ని అనుగ్రహించారు. ఆనాడు గురుదేవులు పాడిన క్రొత్త భజనలు :

చైతన్యభజన - 1

ముకుంద మురారి - మురళీ ధారి
జై గిరిధారి శ్యామ మురారి
శ్యామ మురారి ॥ ముకుంద ॥
యదునంద లాల గాన విలోల
దీనపాల గోకులబాల
రాధా రాధా రాధా కృష్ణా !
మధురా నాథా మాధవ కృష్ణా !
మాధవ కృష్ణా ! ॥ ముకుంద ॥

చైతన్యభజన - 2

హర హర మహాదేవ శంభో
అఖండ మహిమా విభో ॥ హర ॥
అనంత రూపా ప్రేమ స్వరూపా
శ్రీ శంకర మహాదేవ ॥ హర ॥
ప్రణవ స్వరూపా శివా
బ్రహ్మానంద శివశివా
పరమకృపాకర సద్గురు దేవా!
త్రిపురారి గంగాధరా! ॥ హర ॥


గురుదేవుల ఆశీస్సులతో జనార్దన సేవ

గురుపూర్ణిమ సందర్భాన్ని పురస్కరించుకొని సర్వజ్ఞ కల్చరల్ ట్రస్ట్ - సుందర చైతన్య ఆశ్రమం వారి ఆధ్వర్యంలో **11-7-2026** శనివారం కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ ఫేజ్ - **4** లోని శ్రీ సిద్ధి వినాయక ఆలయ ప్రాంగణంలో పేదలకు నిత్యావసర సరుకుల కిట్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. గురు స్తోత్రాలు - భజనలతో ట్రస్ట్ ప్రతినిధులు గ్రహీతలకు భక్తిని, ఆధ్యాత్మిక స్ఫూర్తిని కలిగించి ఆనంద పరచారు.





జై జై గురుదేవ!



ఆత్మ బంధువులారా,
ఓం నమో భగవతే వాసుదేవాయ.

ఆషాఢంలో ఆచార్యుని సేవ, శ్రావణంలో ఆదిదేవుని సేవ - ఒక మాసం గడువులో గురుగోవిందుల సేవాభాగ్యం నిజానికి భక్తులకు, ముముక్షువులకు వరప్రసాదమనే చెప్పాలి.

మొదట గురుపూర్ణిమ; తరువాత కృష్ణాష్టమి. ముందు గురువు లభిస్తాడు; తరువాత గోవిందుడు అనుగ్రహిస్తాడు. ఈ మధ్యకాలం ఒక్క నెల మాత్రమే. గురు దేవుడు, ఆదిదేవుడు ఇరువురూ ఒక్కరేయని దాని భావమా?

ఆషాఢంలో ఆచార్యుని సేవనం - శ్రావణంలో శ్యామనాథుని దర్శనం - ఇది జరిగితే బ్రతుకంతా భద్రమే. అందుకేనేమో భాద్రపదంలో విఘ్ననాయకుని అర్చన! ఆ తరువాత అంతా విజయమేనని సూచిస్తూ ఆశ్వయుజంలో విజయదశమి. విజయాన్ని సాధించిన సాధకులు మోక్షసామ్రాజ్యాన్నధిష్ఠించి శోభిస్తారు. ఇది మామూలు వెలుగు కాదు. జ్ఞాన వెలుగు. జ్ఞానదీపం...... అదియే కార్తీకంలో దీపావళి.

ముముక్షువు అందరూ సాధనకు ప్రాముఖ్యత నివ్వాలి. సంశయ కెరటాల మధ్య జీవననౌక తారుమారు గాకుండా చూసుకోవాలి. క్రొత్త బాటలు అన్వేషించడం మాని నడకలో క్రొత్తదనాన్ని తయారుచేసుకోవాలి.

కొందరు ధ్యానం నేర్పమంటే ధ్యానం నేర్పాను. ఇంకెక్కడో సులభంగా ధ్యానాన్ని నేర్పుతారని విని అక్కడి కెళ్ళారు. నాలుగు రోజులు తికమకపడి వచ్చారు. "స్వామీ! మీరు నేర్పిన ధ్యానం శాంతి నిచ్చింది. అక్కడ అంతా అయోమయం" అంటారు. ఈ మాటలు విని పొంగిపోయే స్వల్పబుద్ధి నా కుందని.

గురువును అనుసరించడం, గోవిందుని అనుస్మరించడం అంత సులభమైన పని కాదు. గురువును అనుసరించడం అంటే గురువుకు శరణాగతులు కావడం అని భావం. ఇక్కడ స్వేచ్ఛ హరింపబడుతున్నదని వాగుడుకాయల పలవరింపు. క్రమజీవనం లోనే నిజమైన స్వేచ్ఛ ఉన్నదని గ్రహించే సంస్కారం ఎందరి కుంటుంది?

భగవంతు డొక్కడే. అట్టి భగవంతుని జూపే గురుదేవుడు కూడా ఒక్కడే. "అనేకమంది గురువులను స్వీకరించవచ్చా?" అని చాలామంది నన్ను ప్రశ్నిస్తూ ఉంటారు. ఈ విషయంలో నాకు స్థిరమైన అభిప్రాయాలున్నాయి. ఇక్కడ నేను రాజీపడను; పడలేను.

గురువు ఒక్కడే ఉండాలి. ఒక్క గురువునే అనుసరించాలి. అనేక గృహాల ముందు నిలబడి యాచించి ఆకలి తీర్చుకోవడం బిచ్చగాని లక్షణం. అమ్మనడిగి ఆకలి తీర్చుకోవడం బిడ్డ లక్షణం. గురుబిడ్డలు బిచ్చగాళ్ళు కాకూడదు.

నా ఆశ్రమంలో ఉండాలని, నా శిష్యులుగా పడి ఉండాలని భావించి వచ్చే వారికి నేను ఒకే విషయం చెబుతూ ఉంటాను. "బాబూ! ఈ పడిగాపుల వల్ల బ్రతుకులో వడగాడ్పులు తొలగవు. నేను నీకు క్రొత్త కావచ్చు. గురువులు నీకు క్రొత్తగాదు. అనేక మందిని చూసి నా దగ్గరకి వచ్చావు. నన్ను చూసి మరొకరి దగ్గరికి చేర్తావు. గురువుల వద్ద ఉండేందుకు అలవాటు పడ్డావు. క్రొత్త గురువు వద్ద పాత గురువుల్ని నిందించేందుకు సిద్ధపడ్డావు. ఇలా ఎంతకాలం తిరుగుతావు? తిరిగి తిరిగి ఏం వంట బట్టించుకున్నావు? "తిరిగే రాతికి పాచి పట్టదు" అనే నానుడికి నూతన అర్థాన్ని ఇస్తున్నావు. అంతే. నీకు కావలసింది ఆచార్యుడు కాదు. అనుసరించే బుద్ధి. అది లేనినాడు ఆచార్యుడు ఉండి ఉపయోగం లేదు".

ఇక్కడ నా భావం స్పష్టంగా, స్వచ్ఛంగా ఉంది. తొందరపడి అపార్థాన్ని సృష్టించుకోకండి. నేను చెప్పింది "అనుసరించమని" - నన్ను అనుసరించమని కాదు.

అర్థమైనదా! ఇకనైనా అనుసరిద్దామా! కానీ ఒక్కమాట! నీవు గురువు ననుసరించాలంటే, ఆశ్రయించాలంటే, నీ మనస్సును అనుసరించడం మానేయాలి సుమా! అప్పుడే అది శరణాగతి అవుతుంది.

మాటలో బాట, బాటలో మాట - ఇదియే గురుదేవుని మార్గం.

ఇక ఎవరి బాట వారిది.

ॐ స్వామి సుందర చైతన్యానంద

